ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
కడప
జిల్లా వార్తలు

ఆదివారం 9 నవంబరు 2025

భక్తులతో కిటకిటలాడుతున్న పెద్ద దర్గా



కడప కల్చరల్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): కడపలోని ప్రఖ్యాత పెద్దదర్గా ఉరుసు మహోత్సవాలను పురస్కరించుకుని శనివారం భక్తులు పెద్ద ఎత్తున హాజరయ్యారు. దీంతో పెద్దదర్గా పరిసరాలు జనంతో కిటకిటలాడాయి. భక్తులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా దర్గా కమిటీ ప్రతినిధులు ఏర్పాట్లు చేశారు. పోలీసులు గట్టి బందోబస్తు నిర్వహిస్తూ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు జాగ్రత్తలు చేపట్టారు. నగరమంతా సీసీ కెమెరాలతో గట్టి నిఘా ఉంచారు.

కోదండరాముడికి స్నపన తిరుమంజనం



సుగంధ ద్రవ్యాలను తీసుకువస్తున్న ఆలయ అధికారి

ఒంటిమిట్ట, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : కోదండరామాలయంలో శనివారం స్నపన తిరుమంజనం కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు వీణా రాఘవాచార్యులు, మనోజ్‌కుమార్ మూలవిరాట్‌లకు అభిషేకం చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అంతకుముందు ఆలయ ఇన్‌స్పెక్టర్ నవీన్‌కుమార్, విజిలెన్స్ అధికారి గంగులయ్య సుగంధ ద్రవ్యాలను, పట్టు వస్త్రాలను, పుష్పాలను ఆలయ అర్చకులకు అందజేశారు. అర్చకులు స్వామి వారికి సుగంధ ద్రవ్యాలతో అభిషేకం చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్తీకమాసం శనివారం కావడంతో రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు విచ్చేసి స్వామి వారి అభిషేక కార్యక్రమాల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ అధికారులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

గ్రామకంఠాలకు లైన్ క్లియర్

- జిల్లాలో 1,30948 ఇంటి స్థలాలు, ఇళ్లు
- డిసెంబరులోగా యాజమాన్య హక్కులు



గ్రామకంఠంలోని ఇళ్లను సర్వేచేస్తున్న అధికారులు

కడప కలెక్టరేట్, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): జిల్లాలో అనేక గ్రామాల్లో దశాబ్దాల నాటి ఇళ్లు, స్థలాలకు పూర్తి యాజమాన్య హక్కులు లేవు. వీటిని అమ్ముకోవాలన్నా, ఎవరైనా కొనుక్కోవాలన్నా రిజిస్ట్రేషన్లు జరగవు. దీనికి కారణం ఈ ఇంటి స్థలాలు, ఇళ్లు గ్రామకంఠాల్లో ఉండడటమే. వీటిపై యాజమాన్య హక్కులు కల్పించేలా కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన స్వామిత్వ కార్యక్రమం తిరిగి అమలు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం సమాయత్తమైంది. వీరికి యాజమాన్య హక్కులతో పాటు ప్రతి ఇంటికి స్కెచ్, స్వామిత్వ కార్డులను అందించేందుకు ఇప్పటికే సీసీఎల్ఏ కమిషనర్ ఉత్తర్వులు జారీచేశారు. దీంతో జిల్లాలో ప్రాపర్టీ పార్సల్ మ్యాపుల (పీపీఎం) ద్వారా గ్రామకంఠాల్లో ఇళ్ల స్థలాలు, ఇళ్లు 1,30,948 ఉన్నట్టు గుర్తించారు. ఇందులో ఇప్పటికే జిల్లా సర్వేశాఖ, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, రెవెన్యూ శాఖలు సమన్వయంతో పనిచేసి అర్హులందరికీ డిసెంబరు నాటికి యాజమాన్య హక్కులు కల్పించనున్నారు. ఇది ఏళ్లతరబడి నిరీక్షిస్తున్న గ్రామ కంఠాల్లో స్థలాలు, ఇళ్లున్న వారందరికీ శుభవార్తే.

229 గ్రామాల్లో గ్రామకంఠాల గుర్తింపు

జిల్లా వ్యాప్తంగా ఫేజ్-2 కింద 250 గ్రామాల్లో గ్రామకంఠాలను గుర్తించనున్నారు. అయితే ఇందులో 21 గ్రామాలు రిజర్వాయర్లలో, కడప కార్పొరేషన్, ఇతర మున్సిపాలిటీల్లో కలవడంతో వాటిని పక్కన బెట్టారు. మిగిలిన 229 గ్రామాల్లో స్వామిత్వ కార్యక్రమం సాగుతోంది. ఈ గ్రామాల్లో ప్రాపర్టీ పార్సల్ మ్యాపుల(పీపీఎం) ద్వారా గ్రామ కంఠాల్లో ఉన్న 1,30,948 ఇళ్లు, ఇళ్ల స్థలాలను గుర్తించారు. ఇందులో సెంటు నుంచి 5 సెంట్లు పైబడి స్థలాల్లో నివాసాలు ఉన్నవారికి, ఇళ్ల స్థలాలు అనుభవంలో ఉన్నవారికి పూర్తి హక్కులు కల్పించనున్నారు. గతంలో జగన్ సర్కారులో ఫేజ్-1 కింద స్వామిత్వ జరిగినప్పటికీ అంతా తప్పుల తడకగానే సాగింది. చోటా మోటా నేతల హవాతో అర్హులకు అన్యాయం చేశారనే విమర్శలున్నాయి. అది కూడా పూర్తిస్థాయిలో సర్వే జరగలేదు. ఇప్పుడు చంద్రబాబు సర్కారులో దీనిని పూర్తిచేసి ప్రజలకు మరింత మేలు చేసేందుకు గత నెల నుంచి ఫేజ్-2 కింద గ్రామ కంఠాల సర్వే వేగవంతంగా సాగుతోంది.

సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్లతో సర్వే

భూముల రీసర్వేతో తలమునకలుగా ఉన్న సర్వేశాఖకు కొంత ఊరటనిస్తూ సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్లకు గ్రామకంఠాలను గుర్తించే బాధ్యత అప్పగించారు. 1-5 సెంట్ల స్థలాలు కావడంతో వీరు పూర్తిస్థాయిలో గ్రామాల్లో విచారణ చేసి, సచివాలయాల పరిధిలో అర్హుల జాబితా ప్రదర్శించనున్నారు. అయితే వీరికి స్థలాలు, హక్కుదారులను గుర్తిస్తున్నారే కానీ.. ఆ స్థలాలకు మ్యాపులు రూపొందించడం సాధ్యం కాదంటూ చేతులెత్తారు. దీంతో ప్రతి ఇల్లు, స్థలం పొడవు వెడల్పు వివరాలను రెవెన్యూ సచివాలయం సిబ్బంది గుర్తించాక వీటన్నింటికి మ్యాపులు రూపొందించే బాధ్యతను సర్వేశాఖకు అప్పగించారు. వారంలోగా ఈ పని పూర్తిచేసేందుకు కసరత్తు ముమ్మరం చేశారు.

హక్కుదారులకు నోటీసులతో ఆస్తుల నిర్ధారణ

క్షేత్రస్థాయిలో విచారణ అనంతరం హక్కుదారులకు తనిఖీలు పూర్తయినట్లు నోటీసులు జారీ చేసి అభ్యంతరాలను స్వీకరిస్తారు. అనంతరం రికార్డ్స్ ఆఫ్ రైట్స్ (ఆర్ఓఆర్) కింద ఆస్తుల యాజమాన్య హక్కులు కల్పిస్తూ ముద్రించిన జాబితాను పంచాయతీ, సచివాలయాల్లో ప్రదర్శించనున్నారు. అనంతరం హక్కుదారులకు యాజమాన్య కార్డులు ఇస్తారు. దీంతో గ్రామకంఠాల్లోని రిజిస్ట్రేషన్లకు మార్గం సుగమం కానుంది. తద్వారా బ్యాంకు రుణాలకు లైన్ క్లియర్ కానుంది.



పారదర్శకంగా గ్రామకంఠాల గుర్తింపు

జిల్లా వ్యాప్తంగా గ్రామ కంఠాల్లో ఉన్న ఇళ్లను, ఇళ్ల స్థలాలను గుర్తించే ప్రక్రియ పారదర్శకంగా సాగుతోంది. జిల్లా పంచాయతీ రాజ్, సర్వేశాఖల పర్యవేక్షణలో ఇప్పటికే 229 గ్రామాల్లో ఇంటి స్థలాలు, ఇళ్లు కొలతలు వేయడంతో పాటు హక్కుదారులను గుర్తించాం. వారం పదిరోజుల్లో వీటికి సంబంధించిన పీపీఎం చిత్రాలను సర్వేశాఖ సిబ్బంది సిద్ధం చేస్తున్నారు. డిసెంబరు నాటికి ప్రభుత్వం యాజమాన్య హక్కు కార్డులతో గ్రామ కంఠాలకు క్లీన్‌చిట్ ఇవ్వనుంది.

- మురళీకృష్ణ, అసిస్టెంట్ డైరెక్టర్, జిల్లా సర్వేశాఖ

విద్యార్థులు నాయకత్వ లక్షణాలను అలవర్చుకోవాలి



మాట్లాడుతున్న డీఈవో షంషుద్దీన్

ప్రొద్దుటూరు టౌన్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు నాయకత్వ లక్షణాలను అలవర్చుకోవాలని డీఈవో ఎస్.షంషుద్దీన్ పేర్కొన్నారు. శనివారం జార్జ్‌కారోనేషన్ క్లబ్‌లో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు జిల్లా స్థాయి మాక్ అసెంబ్లీ నిర్వహించారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ రాజ్యాంగ అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 26న అమరావతిలో స్టూడెంట్ అసెంబ్లీ నిర్వహించనున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొనే విద్యార్థులను ఎంపిక చేయడానికి జిల్లాస్థాయి మాక్ అసెంబ్లీ నిర్వహిస్తున్నామన్నారు. నియోజకవర్గానికి ఒక విద్యార్థినిని ఎంపిక చేసి స్టూడెంట్ అసెంబ్లీకి పంపుతామన్నారు. స్టూడెంట్ అసెంబ్లీలో పాల్గొనే విద్యార్థులు తమకిచ్చిన బాధ్యతను సక్రమంగా నెరవేర్చి మంచి పేరు తేవాలని సూచించారు. నేటి విద్యార్థులు భవిష్యత్తులో ఎమ్మెల్యే, ఎంపీ, మంత్రిగా చట్టసభల్లో కూర్చొవడానికి ప్రయత్నం చేయాలని సూచించారు. మాక్ అసెంబ్లీలో విద్యార్థుల ప్రశ్నలు, సమాధానాలతో ఉత్సాహంగా, ఆసక్తిగా సాగింది. ఈ కార్యక్రమంలో ఉప విద్యాశాఖాధికారులు రాజగోపాల్‌రెడ్డి, మీనాక్షి, జిల్లాస్థాయి నోడల్ ఆఫీసర్ చిట్టిబాబు, ఎంఈవోలు సావిత్రమ్మ, శోభారాణి, నేతాజీ సోషియల్ క్లబ్ కన్వీనర్ భాస్కర్‌రావు పాల్గొన్నారు.

సీబీఐటీలో ఘనంగా స్టాటో ఎక్స్ ఆవిష్కరణ



గాలిలోకి బెలూన్లు వదిలిన విద్యార్థులు



సెన్సార్ వదిలిన విద్యార్థులు

చాపాడు, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): సీబీఐటీలో శనివారం స్టాటో ఎక్స్ ఆవిష్కరణను ఘనంగా నిర్వహించినట్లు కరస్పాండెంట్ జయచంద్రారెడ్డి పేర్కొన్నారు. ఎస్ఎఫ్ శాస్త్రవేత్తలు డాక్టర్ బి.రాధాకృష్ణన్, కడప వైఎస్సార్ ఆర్కిటెక్చర్ యూనివర్శిటీ వైస్‌చాన్సలర్ జయరామిరెడ్డి ఈ ప్రయోగాలను పర్యవేక్షించారు. ఇంజనీరింగ్ విభాగాలకు చెందిన 35 మంది విద్యార్థులు విడివిడిగా ప్రయోగాలు చేశారు. వాతావరణ సమాచారం తెలిపే బెలూన్, సెన్సార్ డిజైనింగ్, జీపీఎస్, యూవీ కిరణాల గుర్తింపు, ఉష్ణోగ్రత, పీడనం, తేమ వంటివి తెలుసుకునేందుకు ప్రయోగాలు నిర్వహించినట్లు చెప్పారు. బెలూన్లను గాలిలోకి ఎక్కువ ఎత్తులోకి ఎగురవేశారు.

ఈ ప్రాజెక్టులను ఇండియా బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డులో నమోదు చేసినట్లు ఆయన చెప్పారు. ప్రయోగాలపట్ల సీఈవో లోహిత్‌రెడ్డి, డైరెక్టర్ అడ్మిన్ శ్రీనివాసులరెడ్డి, ప్రిన్సిపాల్ శృతి హర్షం వెలిబుచ్చారు.

ఎన్‌ఫోర్స్‌మెంట్ దాడులు

- రేషన్‌బియ్యం స్వాధీనం



బియ్యం బ్యాగులను పరిశీలిస్తున్న ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు

దువ్వూరు, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): దువ్వూరు మండలం జిల్లేళ్ల గ్రామంలో పాడుబడిన ఇంటిలో అక్రమంగా నిలువ ఉంచిన రేషన్ బియ్యాన్ని శనివారం సివిల్‌సప్లై ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి శివప్రసాద్, ఫుడ్ ఇన్‌స్పెక్టర్ మహేంద్రనాధరెడ్డి సంయుక్తంగా దాడి నిర్వహించి స్వాధీనం చేసుకున్నారు. ఉన్నతాధికారులకు అందిన సమాచారం మేరకు ఈ దాడులు జరిగినట్లు తెలుస్తోంది. ఉదయం 11 గంటల ప్రాంతంలో అధికారులు జిల్లేళ్లలో బియ్యం నిలువ ఉంచిన ఇంటి వద్దకు చేరుకోగా తాళం వేసి ఉంది. సంబంధిత వ్యక్తికి అధికారులు ఫోన్ చేయగా ఇదిగో వస్తున్నానంటూ అటువైపు రాకుండా మొఖం చాటేశాడు. అధికారులు నిరీక్షించి చివరకు ఓపిక నశించి అయిదు గంటల ప్రాంతంలో స్థానిక వీఆర్వో ద్వారా తాళం పగులకొట్టించారు. గదిలో పరిశీలించగా సుమారు 50 సంచుల్లో బియ్యం నిల్వ ఉంచినట్లు గుర్తించారు. వీటిని తూకం వేసేందుకు రాత్రి 7.40 గంటలకు దువ్వూరుకు తరలించారు.

విద్యార్థినిపై దాడి

- చర్యలు తీసుకోవాలని తండ్రి ఫిర్యాదు

7

అలుగుపారిన బద్వేలు పెద్దచెరువు



నిండిన బద్వేలు పెద్దచెరువు

బద్వేలుటౌన్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఇటీవల కురిసిన వర్షాలతో బద్వేలు పెద్ద చెరువుకు నిండి శనివారం అలుగుపారింది. 1.6 టీఎంసీల సామర్థ్యమున్న బద్వేలు పెద్ద చెరువు అలుగు పారుతుండటంతో రైతులు ఆనందం వ్యక్తం చేశారు. శనివారం ఉద యం మాజీ ఎమ్మెల్యే విజయమ్మ, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి రితేశ్‌కుమార్ రెడ్డిలు బద్వేలు పెద్దచెరువులో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇటీవల కురిసిన వర్షాలకు చెరువులు కళకళలాడుతున్నాయని అన్నారు. గత సంవత్సరం నీరులేక కరువుతో రైతన్న లు చాలా ఇబ్బందులకు గురయ్యారని, ఈ కూటమి ప్రభుత్వంలో రైతులు చాలా ఆనం దంగా ఉన్నారన్నారు. త్వరలోనే చెరువుల కింద ఉన్న పిల్లకాలువలకు మరమ్మతులు చేయించి అన్నివిధాలా ఆదుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎస్‌పీడ్యాం చైర్మన్ ఈగ రమణారెడ్డి, కూటమి నేతలు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. కాగా.. నీటిపారుదల శాఖ డీఈ వేణుగోపాల్ మాట్లాడుతూ బద్వేలుపెద్దచెరువు కింద 10వేల ఎకరాల ఆయకట్టు ఉందని అన్నారు. చెరువు నిండటంతో ఆయకట్టు సాగుతోపాటు ప్రజలకు తాగునీటికి ఇబ్బంది ఉండదన్నారు. బద్వేలు నియోజకవర్గంలో 220 చెరువులు ఉండగా 210 చెరువులు నీటితో నిండుగా ఉన్నాయన్నారు.



బద్వేలు పెద్దచెరువులో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న మాజీ ఎమ్మెల్యే విజయమ్మ, రితేశ్‌కుమార్‌రెడ్డి తదితరులు

కప్పం కట్టాల్సిందే..!

- బిల్డింగ్ కట్టాలంటే.. భవనానికో రేటు
- అందులో వైసీపీ కార్పొరేటర్లు.. అధికార పార్టీ నేతలు
- భవనం కట్టాలంటేనే భయపడుతున్న జనం
- గత ఏడాది సిటీ ప్లానింగ్ ద్వారా కార్పొరేషన్‌కు రూ.24 కోట్ల ఆదాయం
- ఈ ఏడాదిలో ఇప్పటి వరకు రూ.10కోట్లు మాత్రమే
- ఇదీ.. కార్పొరేషన్‌లో దందాల తీరు


కార్పొరేషన్ పరిధిలో నివాస గృహమైనా, కమర్షియల్ భవనం అయినా కట్టుకోవాలంటే సిటీ ప్లానింగ్ అనుమతులు తప్పనిసరి. ఇప్పుడు ట్రెండ్ మారింది. సిటీ ప్లానింగ్ అధికారులే కాదు.. ఆ డివిజనులో ఉండే కొంతమంది కార్పొరేటర్లు, అధికార పార్టీ నేతలకు కప్పం కడితే తప్ప బిల్డింగ్ కట్టుకోలేని పరిస్థితి దాపురించింది. చంద్రబాబు ఉచిత ఇసుక ఇవ్వడంతో భవన నిర్మాణంలో అయ్యే వ్యయం కాస్త తగ్గింది. ప్లాన్ అనుమతులు కూడా సులభతరం చేశారు. రియల్ ఎస్టేట్, భవన నిర్మాణ రంగాన్ని పరుగులు పెట్టించేందుకు ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటోంది. అయితే కొంతమంది కార్పొరేటర్లు అధికార పార్టీ నేతలకు కప్పం కట్టలేక భవన నిర్మాణాలు సాగించేందుకు ఆసక్తి చూపడంలేదు.

(కడప-ఆంధ్రజ్యోతి): కడప నగరం ఇటీవల శరవేగంగా విస్తరిస్తోంది. వివిధ కార్పొరేట్ సంస్థలు బ్రాంచ్‌లను ఏర్పాటు చేస్తున్నాయి. దీంతో కమర్షియల్ బిల్డింగులకు గిరాకీ రావడంతో అపార్ట్‌మెంట్లు, ఇతర కాంప్లెక్స్‌లు వెలుస్తూ వస్తున్నాయి. ఇటీవల కొందరు వైసీపీ కార్పొరేటర్లు, టీడీపీ నేతలు వారి పరిధిలో ఎవరైనా నివాస భవనం కట్టుకున్నా అపార్ట్‌మెంటు, వాణిజ్యభవనం నిర్మించినా డబ్బులు డిమాండ్ చేస్తుండడం దుమారం రేపుతోంది. సీపీ బ్రౌన్ గ్రంథాలయానికి సంబంధించిన భవనం నిర్మిస్తుంటే కార్పొరేటరు భర్త రూ.6లక్షలు డిమాండ్ చేశారంటూ కాంట్రాక్టరు వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ ఇష్యూ సర్దుమణగకముందే కొందరు కార్పొరేటర్లు, టీడీపీ నేతలు డివిజన్లకు వారే రాజులన్నట్లుగా చెలరేగుతున్నారు.

మచ్చుకు కొన్ని..

- రవీంద్రనగర్‌లో ఓ వ్యక్తి 3 సెంట్లలో ఇల్లు కట్టుకుంటుండగా నిర్మాణంలో లోపాలు ఉన్నాయంటూ ఓ పార్టీ నేతలు రూ.5లక్షలు డిమాండ్ చేశారు. చివరికి రూ.3లక్షలు ఇచ్చి సెటిల్ చేసుకోగా ఈ విషయం తెలిసి నాకేంటని ఇంకో బ్యాచ్ వెళ్లడంతో ఆ వ్యక్తికి మైండ్ బ్లాక్ అయింది. ఇంటి నిర్మాణాలకన్నా వీరి కప్పమే ఎక్కువైందంటూ వాపోయారు.
- శారదా నిలయం సమీపంలో రెండు ఇళ్లు కలిపి ఒకే ఇల్లు నిర్మించారు. దీనికి ఓ నేత పేరు చెప్పి నిర్మాణం చేపట్టారు. వెంటనే ఓ బ్యాచ్ వెళ్లి రూ.10లక్షలు డిమాండ్ చేసినట్లు చెబుతున్నారు.
- రాజారెడ్డివీధి సమీపంలో నిబంధనలు ఉల్లంఘించి బిల్డింగు కడుతున్నారని స్థానికులు అధికారులకు ఫిర్యాదు చేశారు. అక్కడ ఓ నేత ఆ భవనదారుని వద్ద డబ్బులు తీసుకుని అక్రమ నిర్మాణాన్ని దర్జాగా సాగిస్తున్నట్లు చెబుతున్నారు. గతంలో ఆయా డివిజన్‌లో ఒక బ్యాచే వసూలుకు పాల్పడేది. ఇప్పుడు కొందరు కార్పొరేటర్లు, అధికార పార్టీ నేతలు వసూళ్లకు దిగడం గమనార్హం.

కార్పొరేషన్ ఆదాయానికి గండి



కార్పొరేషన్‌కు గత ఆర్థిక సంవత్సరంలో సిటీ ప్లానింగ్ ద్వారా రూ.24 కోట్ల ఆదాయం వచ్చింది. ఈ ఆర్థిక సంవత్సరంలో ఇంతవరకు రూ.10 కోట్లు మాత్రమే వచ్చింది. నాలుగు నెలల్లో ఆర్థిక సంవత్సరం ముగియనుంది. గత ఏడాది టార్గెట్ చేరుకోవాలంటే మరో రూ.14 కోట్లు రావాలి. ఈ నాలుగు నెలల్లో అంత వసూలు కావడం అసాధ్యం. అనధికార లేఅవుట్లలో 3 సెంట్లలో ఇల్లు కడితే కార్పొరేషన్‌కు రూ.2.50 నుంచి రూ.3లక్షల వరకు ఫీజుల రూపంలో వస్తుంది. అదే స్థలంలో కమర్షియల్ భవనం అయితే రూ.5లక్షల వరకు ఆదాయం వస్తుంది. నిర్మాణరంగం ఊపందుకుంటే కార్పొరేషన్ ఆదాయంతో పాటు భవన నిర్మాణ కార్మికులకు ఉపాధి, సిమెంటు, ఇనుము తదితరాలతో ప్రభుత్వానికి జీఎస్టీ రూపంలో పన్నులు జమవుతాయి. అయితే కొందరు కార్పొరేటర్లు, టీడీపీ నేతలు డబ్బులు ఇవ్వాలని డిమాండ్ చేస్తుండడంతో చాలామంది నిర్మాణాలకు అంత ఆసక్తి చూపడంలేదు. గతంలో ప్రతి నెలా 150 దాకా ప్లాన్‌లు వస్తే ఇప్పుడు 20 కూడా రావడంలేదు. అపార్ట్‌మెంట్లు, వాణిజ్య భవనాలకు సంబంధించి గత నెలలో ఒక్క దరఖాస్తు కూడా రాలేదు. అంటే కడప నగరంలో కార్పొరేటర్లు, అధికార పార్టీ నేతల దందా ఏ స్థాయిలో ఉందో స్పష్టమవుతుంది.

మిలటరీ మద్యం ముసుగులో అక్రమ రవాణా

● మదనపల్లె డివిజన్‌లో రిటైల్ సేల్స్

మదనపల్లె టౌన్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో నాటుసారా, కర్ణాటక మద్యం, నకిలీ మద్యం తయారీ, రవాణా, విక్రయాలపై ఎక్సైజ్ పోలీసులు దాడులు చేసి కేసులు పెడుతున్నారు. వీటన్నింటిని మించి కొందరు వ్యక్తులు సైనికులు, మాజీ సైనికులు మిలటరీ క్యాంటీన్ నుంచి తెచ్చుకునే మద్యాన్ని కొనుగోలు చేసి రిటైల్‌గా విక్రయిస్తున్నారు. నిబంధనల ప్రకారం ఒక వ్యక్తి ఇంట్లో మూడు ఫుల్ బాటిళ్లకు మించి మద్యం నిల్వ ఉంచరాదు. కానీ రిటైల్ వ్యాపారులు నిబంధనలు అతిక్రమించి మిలటరీ మద్యాన్ని నిల్వ ఉంచుకుని మరీ విక్రయిస్తున్నారు.



మూడు స్కాచ్‌లు.. ఆరు బ్రాందీ బాటిళ్లుగా..

డిఫెన్స్‌లో విధులు నిర్వహిస్తున్న సైనికులు, అధికారులు, కెప్టెన్‌లకు వారి హోదాను బట్టి మిలటరీ క్యాంటీన్‌లో కేంద్ర, రాష్ట్ర పన్నులు మినహాయించి సరుకులు, వస్తువులు, మద్యం విక్రయిస్తారు. ఆంధ్రలో మద్యం ధరల కన్నా మిలటరీ మద్యం ధరలు అతి తక్కువగా ఉండటంతో పాటు నికార్సైన సరుకు అనే ఊహతో మద్యంప్రియులు వీటిని కొనుగోలు చేసేందుకు ఎగబడుతున్నారు. దీనిని ఆసరాగా తీసుకున్న కొంతమంది రిటైల్ వ్యాపారులు అధిక ధరలకు విక్రయాలు చేస్తున్నారు. జిల్లాలోని మదనపల్లె, పీలేరు, రాయచోటి, రాజంపేట, రైల్వేకోడూరు నియోజకవర్గాల్లోని ప్రధాన పట్టణాల్లో మిలటరీ మద్యం ముసుగులో అక్రమంగా మద్యం రవాణా అవుతోంది. ముఖ్యంగా బ్లాక్ అండ్ వైట్, 100 పైపర్స్, అమృత్, ఇంద్రి, బ్లాక్ డాగ్, బ్లాక్ లేబుల్ నుంచి రెడ్ లేబుల్ వంటి స్కాచ్‌లతో పాటు బ్లెండర్ ప్రైడ్ విస్కీ, మార్ఫియస్ బ్రాందీ బ్రాండ్లను మద్యం ప్రియులు ఇష్టపడుతున్నారు. రిటైల్ వ్యాపారులు కూడా వీటినే తీసుకొచ్చి విక్రయిస్తున్నారు.

బెంగళూరు, తిరుపతి నుంచి రవాణా


కర్ణాటక రాజధాని బెంగళూరు, తిరుపతి కేంద్రాల్లో మిలటరీ క్యాంటీన్లు ఉన్నాయి. తిరుపతి క్యాంటీన్ కన్నా బెంగళూరు క్యాంటీన్‌లో ధరలు తక్కువగా వుండటంతో ప్రతి నెలా మాజీ సైనికులు, సైనికులు, మిలటరీ ఉద్యోగులు అక్కడికే వెళ్లి వారి కోటా ప్రకారం మద్యం కొనుగోలు చేసి, వాటి బిల్లులతో ఆంధ్రలోకి తీసుకొస్తారు. కొందరు మద్యం సేవించని వారి నుంచి రిటైల్ వ్యాపారులు మిలటరీ మద్యాన్ని కొనుగోలు చేసి ఒక్కో బాటిల్‌పై రూ.300 నుంచి రూ.500 లాభంతో విక్రయిస్తున్నారు. వాస్తవంగా బిల్లులు లేకుండా మిలటరీ మద్యాన్ని రవాణా చేయడం, నిల్వచేయడం చట్టవిరుద్ధం. ఈ విషయంపై ఎక్సైజ్ పోలీసులు దృష్టి పెట్టకపోవడంతో రీటైల్ వ్యాపారులు ఆడిందే ఆటగా సాగుతోంది. జిల్లాలో 1000మందికి పైగా మాజీ సైనికులు, సైనిక ఉద్యోగులు వుండగా, వారి కోటా ప్రకారం ఎంత లేదన్నా 6వేల బాటిళ్ల క్యాంటీన్ బిల్లులతో బెంగళూరు నుంచి జిల్లాలోకి వస్తున్నట్లు అంచనా.

క్యాంటీన్ వద్దే బేరసారాలు

జిల్లాలో కొందరు ప్రతి నెలా బెంగళూరులోని మిలటరీ క్యాంటీన్ వద్దకు వెళ్లి అక్కడ సైనికులు, మాజీ సైనికులు, అధికారులతో ముందస్తుగా భేరాలు కుదుర్చుకుంటున్నారు. అధికారుల పేరుతోనే బిల్లులు తీసుకుని మిలటరీ మద్యాన్ని కొనుగోలు చేసి, అక్కడి నుంచి ప్రత్యేక వాహనాల్లో ఆంధ్రకు తరలిస్తున్నారు.

ఆరు నెలల క్రితం మదనపల్లె ఎక్సైజ్ పోలీసులు ఇటువంటి వాహనాన్ని సీజ్ చేసి అంగళ్లుకు చెందిన వ్యక్తిపై కేసు నమోదు చేశారు. అంతే కాకుండా గత నెల 22వ తేదీన మదనపల్లెకు చెందిన రమేశ్ అనే వ్యక్తి 41 మిలటరీ మద్యం బాటిళ్లను కర్ణాటక నుంచి మదనపల్లెకు రవాణా చేస్తుండగా పట్టణంలో ఎక్సైజ్ పోలీసులు దాడి చేసి పట్టుకున్నారు. అతని వద్ద బిల్లులు చూస్తే బెంగళూరుకు చెందిన వ్యక్తుల పేరిట ఉన్నట్లు బయటపడ్డాయి. దీంతో ఎక్సైజ్ పోలీసులు అతడిని అరెస్టు చేసి రిమాండ్‌కు పంపారు. చాప కింద నీరులా సాగుతున్న ఈ అక్రమ వ్యాపారంపై జిల్లా ఎక్సైజ్ అధికారులు దృష్టి సారిస్తే మిలటరీ మద్యం ముసుగులో సాగుతున్న అక్రమ దందాను నివారించవచ్చు. ఏపీ బేవరేజస్ మద్యం విక్రయాలు పెంచవచ్చు.

మాజీ సైనికుల పేరు చెప్పి విక్రయించే వారిని అరెస్టు చేయాలి..



మదనపల్లె డివిజన్‌లో మాజీ సైనికుల పేర్లు చెప్పుకుని మిలటరీ మద్యం రవాణా, విక్రయాలు చేస్తున్న వారిని అరెస్టు చేయాలి. డివిజన్‌లో 300 మంది మాజీ సైనికులు వున్నారు. కొంత మంది మాజీ సైనికులంటూ మద్యం రవాణా చేస్తూ, అధికారులు పట్టుకుంటే తప్పించుకోవాలని చూస్తున్నారు. అటువంటి వారిని అరెస్టు చేయడానికి తమవంతు సహాయ, సహకారాలు అందిస్తాం.

- కంచెర్ల శ్రీనివాసులునాయుడు,
మాజీ సైనికుల సంఘం అధ్యక్షుడు, మదనపల్లె

రాష్ట్ర స్థాయి పోటీలకు తంబళ్లపల్లె విద్యార్థులు


రాష్ట్ర స్థాయికి ఎంపికైన చేతన్‌రెడ్డి, మానస, అనూష

తంబళ్లపల్లె, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి నెట్‌బాల్ పోటీలకు కన్నెమడుగు, తంబళ్లపల్లె హైస్కూల్ నుంచి ముగ్గురు విద్యార్థులు ఎంపికైనట్లు జిల్లా స్కూల్ గేమ్స్ కమిటీ కార్యదర్శులు నాగరాజు, ఝాన్సీ తెలిపారు. అక్టోబరు 30న వాల్మీకిపురం మండలం కొత్తమంచూరులో ఉమ్మడి చిత్తూరు జిల్లా స్థాయి నెట్‌బాల్ ఎంపిక పోటీలు నిర్వహించారన్నారు. ఈ పోటీల్లో కన్నెమడుగు హైస్కూలు నుంచి ఎ.మానస, డి.చేతన్‌రెడ్డి, తంబళ్లపల్లె హైస్కూల్ నుంచి పి.అనూష ప్రతిభ చూపి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. వీరు ఈనెల 9, 10 తేదీల్లో విజయవాడ కేబీసీ హైస్కూల్‌లో జరుగబోయే రాష్ట్ర స్థాయి నెట్‌బాల్ పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. పోటీలకు ఎంపికైన విద్యార్థులను ఎంఈఓలు త్యాగరాజు, నాగసుబ్బరాయుడు, హెచ్‌ఎంలు మదన్‌మోహన్, శ్రీనివాసులు, పీడీ ఖాదర్‌బాష, పీఈటీ మొయినుద్దీన్, ఎస్‌ఎంసీ చైర్మన్లు, ఉపాధ్యాయులు అభినందించారు.

అడ్డు తొలగించుకునేందుకే హత్య?

● కుటుంబసభ్యుల ప్రమేయంపై అనుమానాలు..

● కొనసాగుతున్న పోలీసుల దర్యాప్తు



బి.కొత్తకోట, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): బి.కొత్తకోట మండలంలో శుక్రవారం వెలుగుచూసిన యువకుడు జయప్రకాశ్‌రెడ్డి (24) హత్య వెనుక జరిగిన పరిణామాలు, అనుమానితుల విషయంలో దాదాపుగా స్పష్టత వచ్చినట్లు తెలుస్తోంది. మండలంలోని గోళ్లపల్లి పంచాయతీ గుడిసివారిపల్లి వాసి ఎంబీఏ విద్యార్థి జయప్రకాశ్‌రెడ్డి దారుణహత్యకు గురైన విషయం తెలిసిందే. ఈ ఘటనపై డీఎస్పీ ఆదేశాల మేరకు బి.కొత్తకోట సీఐ గోపాల్‌రెడ్డి డాగ్ స్క్వాడ్, క్లూస్‌టీంతో క్షుణ్ణంగా విచారణ చేపట్టారు. తల్లీ కొడుకుల మధ్య నెలకొన్న గొడవలే హత్యకు దారి తీసినట్లు నిర్ధారణకు వచ్చినట్లు తెలిసింది. మూడు నెలలుగా తల్లికి దూరంగా ఉంటూ మద్యానికి అలవాటుపడిన జయప్రకాశ్‌రెడ్డిని గురువారం రాత్రి కొందరు నమ్మించి వెంట తీసుకెళ్లి మద్యం తాగించి హత్య చేసినట్లు భావిస్తున్నారు. నిందితులు గోళ్లపల్లి వద్ద హైవే వద్ద వైన్‌షాపులోకి ప్రవేశించి సీసీ కెమెరా హార్డ్‌డిస్క్‌ను తీసుకెళ్లినట్లు పోలీసులు గుర్తించారు. చంపిన చోటి నుంచి మృతదేహాన్ని గుడిసివారిపల్లి వద్దకు తీసుకెళ్లి పడేశారు. హత్య జరిగిన ప్రదేశంలో కీలక ఆధారాలను క్లూస్‌టీం సేకరించింది. గోళ్లపల్లిలోని జాతీయ రహదారిలో ఉన్న పలు సీసీ కెమెరాల ఫుటేజీలను పోలీసులు పరిశీలించారు. ఇప్పటికే పలువురు అనుమానితులను అదుపులోకి తీసుకుని విచారణ చేస్తున్నట్లు సమాచారం. ఒకటి, రెండు రోజుల్లో యువకుడి హత్యపై పూర్తి వివరాలు బయటపటే అవకాశాలు ఉన్నట్లు పోలీసులు చెబుతున్నారు. కాగా మదనపల్లి ప్రభుత్వాస్పత్రిలో పోస్టుమార్టం అనంతరం శుక్రవారం రాత్రికి జయప్రకాశ్‌రెడ్డి మృతదేహాన్ని స్వగ్రామం గుడిసివారిపల్లికి తీసుకొచ్చి అంత్యక్రియలు నిర్వహించారు.

పీలేరులో వేలూరు శ్రీ పీఠం అమ్మవారు



పీలేరు, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): తమిళనాడు రాష్ట్రం వేలూరులోని శ్రీ పీఠం మహాలక్ష్మి అమ్మవారి బంగారు విగ్రహాన్ని దర్శించుకునే అవకాశం శనివారం పీలేరు వాసులకు దక్కింది. హైదరాబాదులో జరుగుతున్న కోటి దీపోత్సవంలో పాల్గొనేందుకు వెళుతున్న శ్రీ పీఠం నిర్వాహకులు, పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిశోర్ కుమార్ రెడ్డి పీఏ సత్య విజ్ఞప్తి మేరకు కాసేపు ఆగారు. పీలేరుకు చెందిన అర్చకులు సూత్రం కిరణ్ కుమార్ స్వామి ఆధ్వర్యంలో అమ్మవారికి పూజా కార్యక్రమాలు, మహా మంగళహారతి నిర్వహించారు. శ్రీ పీఠం నిర్వాహకులు అమ్మవారి ప్రసాదం అందించారు. కార్యక్రమంలో సత్య దంపతులు, దినకర హోటల్ యజమాని ఆంజనేయులు దంపతులు, పెద్దసంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

విద్యార్థులకు పోలీసుల శక్తి పాఠం


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

రాయచోటిటౌన్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు భద్రతావలయం పోలీసులు అందిస్తున్న శక్తి పాఠం అని ఎస్పీ ధీరజ్ కునుబిల్లి తెలిపారు. జిల్లా యువత భవిష్యత్తుకు భద్రత కల్పించే లక్ష్యంతో జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు జిల్లా పోలీసు అధికారులు శక్తి టీం బృందాలతో కలిసి పాఠశాలలు, కళాశాలల్లో వినూత్న అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

సోషల్ మీడియా దుర్వినియోగం, సైబర్ క్రైమ్ ఉచ్చులు, ఆన్‌లైన్ మోసాలు గురించి పోలీసులు వివరంగా తెలిపారు. తప్పుడు సమాచారం షేర్ చేయడం వలన ఎదురయ్యే చట్టపరమైన సమస్యలపై హెచ్చరించారు. గంజాయి వంటి మత్తు పదార్థాల వాడకం వలన వ్యక్తిగత ఆరోగ్యం, కుటుంబం, భవిష్యత్తు నాశనం అవుతుందని వివరించారు. క్రికెట్ బెట్టింగ్ వంటి ఆర్థిక ఊరి పట్ల కూడా యువతను అప్రమత్తం చేశారు.

భక్త కనకదాస సేవలు ఆదర్శనీయం


భక్త కనకదాసకు నివాళులర్పిస్తున్న అదనపు ఎస్పీ

రాయచోటి టౌన్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): సమ సమాజ స్థాపనకు కృషి చేసిన భక్త కనకదాస సేవలు అందరికీ ఆదర్శనీయం అని అదనపు ఎస్పీ ఎం.వెంకటాద్రి తెలిపారు. శనివారం జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో సామాజిక సంస్కర్త, గొప్ప కవి భక్త కనకదాస జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కనకదాస చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ శ్రీభక్త కనకదాస తన కీర్తనల ద్వారా సాజంలో పాతుకుపోయిన కుల వ్యవస్థలను, అసమానతలను నిర్భయంగా ప్రశ్నించారని, మానవత్వపు విలువలే అత్యున్నతమని చాటి చెప్పారన్నారు. పోలీసు సిబ్బంది తమ వృత్తి, విధులను నిర్వహించడంలో కనకదాస గొప్ప ఆదర్శాలను తప్పక ఆచరించాలని కోరారు. కార్యక్రమంలో ఆర్ఐ (అడ్మిన్) వీజే రామకృష్ణ, ఆర్‌ఎస్ఐలు, పోలీసు సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొని భక్త కనకదాస సేవలను స్మరించుకున్నారు.

కబడ్డీ, ఖోఖో పోటీలకు హర్షియ ఎంపిక


హర్షియను అభినందిస్తున్న దృశ్యం

రాజంపేట టౌన్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తబోయనపల్లె ఉన్నత పాఠశాల విద్యార్థిని హర్షి యా రాష్ట్ర స్థాయి కబడ్డీ, ఖోఖో పోటీలకు ఎంపికైనట్లు శనివారం ప్రధానోపాధ్యాయురాలు భారతి తెలిపారు. ఈ సందర్భంగా పీడీ డాక్టర్ ప్రణవి, ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.

అప్పులు తీర్చలేక ఆత్మహత్య


వెంకట్రమణ మృతదేహం

కలికిరి, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): చేసిన అప్పులు తీర్చలేకపోతున్నాననే మనోవేదనతో చలంకోటి వెంకట్రమణ (56) ఆత్మహత్యకు పాల్పడినట్లు పోలీసులు తెలిపారు. శుక్రవారం రాత్రి చోటు చేసుకున్న ఘటనపై కలికిరి పోలీసులు తెలిపిన వివరాల మేరకు తుమ్మలపేట వడ్డెపల్లె వాసి చలంకోటి వెంకట్రమణ ఇంటి ఖర్చుల కోసం దొరికిన చోటల్లా అప్పు చేశాడు. స్థానికంగా ఆదాయం లేకపోవడంతో కేరళ రాష్ట్రానికి వలసపోయి సంపాదన కోసం ప్రయత్నించాడు. అయితే అక్కడ కూడా వెంకట్రమణకు చుక్కెదురైంది. తిరిగి స్వగ్రామానికి చేరుకున్నాడు. ఇక అప్పులు తీర్చలేనన్న మనోవేదనకు గురయ్యాడు. చివరికి విరక్తి చెంది శుక్రవారం రాత్రి క్రిమిసంహారక మందు తాగి అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. పరిస్థితిని గుర్తించిన కుటుంబ సభ్యులు వెంకట్రమణను స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరిశీలించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. మృతుడి భార్య శ్యామల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. శనివారం పరీక్షల అనంతరం వెంకట్రమణ శవాన్ని కుటుంబ సభ్యులకు అందజేశారు.

గ్రైండర్‌లో పడి మహిళ మృతి


అభినయ మృతదేహం

మదనపల్లె అర్బన్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు గ్రైండర్‌లో పడి మహిళ మృతి చెందిన సంఘటన మదనపల్లె పట్టణంలో జరిగింది. వన్‌టౌన్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు... మదనపల్లె పట్టణం మడికయ్యల శివాలయం సమీపంలో నివాసం ఉంటున్న మహేశ్ భార్య అభినయ (20) బెంగళూరు రోడ్డు సమీపంలో మిరపకాయల బజ్జీల వ్యాపారం నిర్వహిస్తుండగా, మహేశ్ ఆటోడ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. శనివారం మధ్యాహ్నం తమకు సొంతంగా ఉన్న గ్రైండర్‌లో పిండి వేస్తూ ప్రమాదవశాత్తు మెడకు వేసుకున్న ఓణీ గ్రైండర్‌లో పడడంతో యువతిని అందులోకి లాగేసింది. దీంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. ఎంతసేపటికీ అభినయ రాకపోవడంతో మహేశ్ పెద్దమ్మ నాగరత్నం అభినయకు ఫోన్ చేసింది. ఫోన్ కూడా ఎత్తకపోవడంతో అనుమానం వచ్చి షాపు పక్కన ఉన్న వారికి ఫోన్ చేసి విషయం తెలిపింది.

అక్కడికి వెళ్లి చూడగా గ్రైండర్‌లో మృతి చెందినట్లు కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. వెంటనే వారు వన్‌టౌన్ పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు అక్కడికి చేరుకుని పరిశీలించి మృతదేహాన్ని మదనపల్లె జిల్లా ఆస్పత్రిలోని మార్చురీకి తరలించారు. ఈ మేరకు వన్‌టౌన్ సీఐ మహమ్మద్ రఫీ అనుమానాస్పద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

ఇసుక టిప్పర్ బోల్తా : ఇద్దరికి గాయాలు


లక్కిరెడ్డిపల్లె, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): గండి నుంచి ఇసుక తీసుకొని వెళ్తున్న టిప్పర్ శనివారం మద్దిరేవుల బ్రిడ్జి వద్ద అదుపు తప్పి బోల్తా పడింది. ఈ మేరకు టిప్పర్‌లో ఉన్న క్లీనర్, డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. ఇసుక టిప్పక్ కొత్తగా రోడ్డు జరుగుతుండడంతో ఎత్తుగా ఉండటం వలన అదుపు తప్పి కింద పడిందని స్థానికులు తెలిపారు. ఈ మేరకు డ్రైవర్, క్లీనర్‌ను ఓ ప్రైవుటు ఆసుపత్రికి తరలించినట్లు స్థానికులు తెలిపారు.

కుటుంబ కలహాలతో మహిళ ఆత్మహత్య


సుగుణ మృతదేహం

మదనపల్లె అర్బన్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): కుటుంబ కలహాలతో గాలేటి సుగుణ (34) బావిలో దూకి ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. తాలుకా పోలీసుల కథనం మేరకు మదనపల్లె మండలం మాలేపాడు పంచాయతీ నడిమూరుకు చెందిన సుధాకర్‌తో చెంబకూరుకు చెందిన కృష్ణప్ప, అమరావతి దంపతుల కుమార్తె సుగుణకు 2006లో వివాహం చేశారు. ఇటీవల మదనపల్లె పట్టణం నీరుగట్టువారిపల్లె, రాజానగర్‌లో అద్దె ఇల్లు తీసుకుని సుధాకర్ చేనేత మగ్గం నేస్తూ జీవిస్తున్నారు. వీరికి ఏడో తరగతి చదువుతున్న నందికిషోర్, మూడేళ్ల తేజశ్విని ఉన్నారు. వీరు పిల్లలతో కలిసి నీరుగట్టువారిపల్లె నుంచి స్వగ్రామం మాలేపాడుకు గురువారం వెళ్లారు. శుక్రవారం రాత్రి 9 గంటలకు కూడా తల్లిదండ్రులతో ఫోన్‌లో మాట్లాడినట్లు తెలిపారు. తరువాత ఏమి జరిగిందో తెలియదు కానీ శనివారం ఉదయం బావిలో శవమై కనిపించింది. స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే తాలుకా పోలీసులు బావి వద్దకు వెళ్లి మృతదేహాన్ని పరిశీలించారు. ఈ మేరకు తాలుకా సీఐ కళా వెంకటరమణ ఆత్మహత్య కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు తెలిపారు.

గుంజన నదిలో పడి వ్యక్తి మృతి


గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

రైల్వేకోడూరు రూరల్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సూరపురాజుపల్లెకు వెళ్లే మార్గంలో ఉన్న బ్రిడ్జి వద్ద గుంజన నదిలో శనివారం గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు తెలియజేశారు. సమాచారం తెలుసుకున్న కోడూరు ఎస్ఐ లక్ష్మీప్రసాద్ రెడ్డి సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని కోడూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మద్యం మత్తులో నీటిలో పడి మృతి చెంది ఉంటాడని పోలీసులు అనుమానిస్తున్నారు. కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు ఎస్ఐ లక్ష్మీప్రసాద్ రెడ్డి తెలిపారు.

పీలేరు రైతు బేజారు....

● రైతుబజార్ ప్రతిపాదనలకే పరిమితమా?!

● అదిగో ఇదిగో అంటూ అధికారుల హడావిడి

● నాలుగేళ్లుగా రూ.26 లక్షలతోనే అంచనా...

● పెరగని అంచనా వ్యయంతో అనుమానాలు

పీలేరు, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఇదిగో ప్రతిపాదనలు, అవిగో నిధుల మంజూరు, అదిగదిగో నిర్మాణం అంటూ గడిచిన నాలుగేళ్లుగా జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారులు పీలేరులో రైతు బజారు నిర్మాణంపై ప్రజల చెవిలో పూలు పెడుతున్నారు. ఏడాదిలో మూడుసార్లు స్థలపరిశీలన జరపడం, రైతు బజారు నిర్మాణానికి అనుమతులు-నిధుల కోసం రాష్ట్ర అధికారులకు ప్రతిపాదనలు పంపామని చెప్పడం, మూడు నెలల్లో వాటిని సాధించి ఆరు నెలల్లో రైతు బజారును నిర్మించేస్తాం అంటూ ప్రగల్భాలు పలకడం పరిపాటిగా మారింది. నాలుగేళ్లుగా ఆ పలుకులు పలుకుతున్నది కూడా ఒకే అధికారి కావడం విశేషం. ఒకే అధికారి నాలుగేళ్లుగా అవే మాటలు చెప్పడం చూసి పీలేరు ప్రజలు, రైతులు విసిగిపోయారు. అసలు పీలేరులో రైతు బజారు నిర్మించాలన్న చిత్తశుద్ధి ప్రభుత్వానికి ఉందా అంటూ వారు ప్రశ్నిస్తున్నారు.

నాలుగేళ్లుగా ప్రతిపాదనల దశలోనే....

పీలేరులో రైతు బజారు ఏర్పాటు చేయాలన్న ప్రతిపాదన ప్రభుత్వంలో, ప్రజల్లో డిమాండు గత దశాబ్దన్నర కాలంగా ఉంది. దాని ఏర్పాటుకు అనువైన స్థలం లభ్యం కాకపోవడంతో అది కార్యరూపం దాల్చలేదు. అప్పటి అధికారులు, ప్రజా ప్రతినిధుల సమిష్టి కృషి కారణంగా 2022లో పీలేరులోని వారపు సంత ప్రాంగణం వద్ద ఉన్న ఖాళీ స్థలంలో 47 సెంట్లను రైతు బజారు కోసం కేటాయించారు. 2022 అక్టోబరు 16వ తేదీ జిల్లా మార్కెటింగ్ శాఖ ఏడీ త్యాగరాజు స్థల పరిశీలన చేసి రూ.26 లక్షలతో 2023 సంక్రాంతి నాటికి రైతు బజారును ప్రారంభిస్తామని ప్రకటించారు. ఆ తరువాత పీలేరును సందర్శించిన పలువురు జిల్లా అధికారులు సైతం త్వరలోనే పీలేరుకు రైతు బజారు మంజూరవుతుందని, తద్వారా పీలేరు ప్రాంత రైతులకు గిట్టుబాటు ధరలు లభించడమే కాకుండా ప్రజలకు నాణ్యమైన ఉత్పత్తులు అందుబాటులోకి వస్తాయని ప్రకటించారు. వారి మాటలు కేవలం నీటిమూటలుగా మిగిలిపోయాయి తప్ప రైతుబజారు నిర్మాణంలో ఒక్క అడుగు కూడా ముందుకు సాగలేదు. ఈలోపు 2024లో కూటమి ప్రభుత్వం కొలువు దీరడం, పీలేరు ఏఎంసీ చైర్మన్‌గా నియమితులైన పురం రామ్మూర్తి సైతం రైతు బజారు ప్రతిపాదనలను జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లడం జరిగాయి. ఆయన అభ్యర్థన మేరకు మరోమారు స్థల పరిశీలన జరిపిన మార్కెటింగ్ శాఖాధికారులు ప్రభుత్వానికి ఫీజుబులిటీ రిపోర్టు సైతం పంపారు. అయినప్పటికీ ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్లు రైతు బజారు ఏర్పాటులో పురోగతి కనిపించలేదు. ఈ నేపథ్యంలో జిల్లా మార్కెటింగ్ శాఖ ఏడీ త్యాగరాజు గత నెలాఖరులో మరోమారు అదే స్థలాన్ని పరిశీలించి, అవే రూ.26 లక్షల ప్రతిపాదనలు ఉన్నతాధికారులకు పంపామని ప్రకటించడంతో స్థానికంగా అనుమానాలు రేకెత్తించాయి.

పెరగని అంచనా వ్యయంతో అనుమానాలు

రైతు బజారు నిర్మాణానికి అవసరమైన నిధుల మంజూరు కోసం అధికారులు పంపిన అంచనాల్లోనూ నాలుగేళ్లుగా మార్పు లేకపోవడం కూడా అధికారుల చిత్తశుద్ధిపై అనుమానాలు రేకెత్తిస్తున్నాయి. నాలుగేళ్లుగా సిమెంటు, స్టీలు, ఇసుక, కంకర, కూలీలు పెరిగిపోయిన నేపథ్యంలో అంచనాలు పెంచకుండా, పాత అంచనాలతో సకల హంగులతో రైతు బజారు ఎలా నిర్మిస్తారంటూ వారు ప్రశ్నిస్తున్నారు. అధికారులకు చిత్తశుద్ధి ఉంటే అంచనా విలువ పెంచే వారని, అలా చేయకుండా కేవలం ప్రకటనలకే పరిమితం అవుతున్నారని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఘనత వహించిన మార్కెటింగ్ శాఖ అధికారులు పీలేరు ప్రజలకు ఏం సమాధానం చెబుతారో వేచి చూడాలి.

ఉభయతారకంగా రైతు బజారు

పీలేరు సంత ప్రాంగణానికి ఆనుకుని ఉన్న ఖాళీ స్థలాన్ని అధికారులు రైతు బజారు కోసం ఎంపిక చేశారు. ప్రతి మంగళవారం వారపు సంత జరిగిన తరువాత పీలేరు పరిసర ప్రాంతాల్లోని రైతులు తమ కూరగాయాలను స్థానిక పాతబస్టాండులో రోడ్డుపై పెట్టుకుని విక్రయించుకుంటూ ఉంటారు. సరైన వసతులు లేకపోవడంతో ప్రతిరోజూ ఉదయం 6 గంటల నుంచి 11 గంటల వరకు తమ వ్యాపారాలు సాగించుకుని ఇళ్లకు వెళ్లిపోతుంటారు. అటువంటి వారి కోసం రైతు బజారులో దుకాణాలు కేటాయిస్తే వారందరూ ఉదయం నుంచి సాయంత్రం వరకు వ్యాపారాలు చేసుకోవచ్చని, ప్రజలకు కూడా తాజా ఉత్పత్తులు అందుబాటు ధరల్లో లభ్యమవుతాయని పలువురు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. మదనపల్లె, రాయచోటి పట్టణాల్లోని రైతు బజార్లను విజయవంతంగా నడుపుతున్న జిల్లా ఉన్నతాధికారులు అదే సూత్రాన్ని పీలేరులో కూడా అమలు చేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

రాష్ట్ర కమిషనర్‌కు పంపాం...

పీలేరులో రైతు బజారు నిర్మాణం నాలుగేళ్లుగా ఆలస్యం అవుతున్న మాట వాస్తవం. అందుకు పలు కారణాలు ఉన్నప్పటికీ ఎలాగైనా కట్టి తీరాలన్న సంకల్పంతో ఇటీవల జిల్లా జాయింట్ కలెక్టర్ ద్వారా రాష్ట్ర మార్కెటింగ్ శాఖ కమిషనర్‌కు ప్రతిపాదనలు పంపాం. త్వరలోనే నిధులు మంజూరవుతాయి. నిధులు మంజూరైన వెంటనే పనులు ప్రారంభిస్తాం.

- త్యాగరాజు, ఏడీ, మార్కెటింగ్ శాఖ


రైతు బజారు కోసం ఎంపిక చేసిన స్థలం


2022లో రైతు బజారు కోసం పీలేరులో స్థలపరిశీలన చేస్తున్న మార్కెటింగ్ శాఖ అధికారులు (ఫైల్ ఫోటో)

కళాశాల ప్రాంగణంలో ఆందోళన చేస్తున్న విద్యార్థులు



విద్యార్థినిపై దాడి

- చర్యలు తీసుకోవాలని బాధిత తండ్రి విజ్ఞప్తి
- క్రమశిక్షణా చర్యలు తప్పవు : కళాశాల యాజమాన్యం

కడప ఎడ్యుకేషన్/క్రైం, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): కడప నగర శివారులోని ఓ ప్రైవేటు డిగ్రీ కళాశాలలో శనివారం చోటుచేసుకున్న ఘటన విద్యార్థి వర్గాల్లో కలకలం రేపింది. అదే కళాశాలలో చదువుతున్న ఓ విద్యార్థి అదే కళాశాల విద్యార్థినిపై భౌతికదాడికి పాల్పడినట్లు సమాచారం. ఈ సంఘటనతో కళాశాల వాతావరణం ఉద్రిక్తంగా మారింది. చిన్నపాటి వాగ్వాదం చోటుచేసుకోవడంతో కోపోద్రిక్తుడై సహవిద్యార్థినిపై దాడికి దిగినట్లు తెలుస్తోంది. అక్కడే ఉన్న తోటివిద్యార్థులు, అధ్యాపకులు వెంటనే అడ్డుకున్నారు. విషయం తెలుసుకున్న కళాశాల యాజమాన్యం బాధిత విద్యార్థినిని వైద్య పరీక్షల కోసం కళాశాల మహిళా సిబ్బందితో రిమ్స్ ఆసుపత్రికి తరలించారు. తన కుమార్తెపై దాడి చేసిన విద్యార్థిపై కఠిన చర్యలు తీసుకోవాలని బాధితురాలి తండ్రి ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఘటనపై స్పందించిన కళాశాల డైరెక్టర్ దాడికి పాల్పడిన విద్యార్థిపై తగిన క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని తెలిపారు. అలాగే పోలీస్‌స్టేషన్‌లో కూడా ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. విద్యాసంస్థల్లో విద్యార్థుల మధ్య వివాదాలు పెరుగుతున్న నేప థ్యంలో ఈ ఘటన మరోసారి ఆందోళన కలిగిస్తోందని ఏబీవీపీ, బీజేపీ నాయకులు తెలిపారు. కళాశాలల్లో సీసీ కెమెరాల పర్యవే క్షణ, కౌన్సెలింగ్ తప్పనిసరి చేయాలన్నారు.

దాడి చేసిన విద్యార్థిపై కేసు నమోదు

దాడి చేసిన యువకుడిపై యువతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు రిమ్స్ ఎస్ఐ సుభాష్‌చంద్రబోస్ తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల మేరకు.. ప్రొద్దుటూరుకు చెందిన అబ్బవరం పీరావల్లి బీకాం కంప్యూటరు ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడని, అదే కళాశాలలో ఒంటిమిట్టకు చెందిన యువతి కూడా చదువుతోందన్నారు. శనివారం తరగతి గదిలో కంప్యూటరుకు సంబంధించి పేపర్లు తీసుకుంటున్న సమయంలో పీరావల్లి మరో పేపరు ఇచ్చాడని, కానీ ఆ పేపరు తనది కాదని యువతి చెప్పడంతో తీవ్ర కోపంతో తరగతి గదిలోనే విద్యార్థినిని జుట్టు లాగి చేతులు కాళ్లతో కొడుతూ దూషించాడన్నారు. ఈ నేపథ్యంలో బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



కళాశాల డైరెక్టర్‌తో మాట్లాడుతున్న ఏబీవీపీ, బీజేపీ ప్రతినిధులు

ఎలుగుబంటి దాడిలో గాయపడిన వృద్ధుడికి ఆర్థికసాయం

కడప ఎన్జీఆర్ సర్కిల్, నవంబరు 8(ఆంధ్ర జ్యోతి): ఎలుగుబంటి దాడిలో గాయపడ్డ వృద్ధుడు గోపాలయ్యకు కడప డీఎఫ్‌వో వినీత్‌కుమార్, సబ్ డీఎఫ్‌వో స్వామివివే కానంద ఆధ్వర్యంలో రూ.1.25 లక్షల సాయం శనివారం అందించారు. చలమారెడ్డి కొట్టాలు సమీపంలో గోపాలయ్య ప్రొటెక్షన్ వాచర్‌గా పనిచేశారని అటవీ అధికారులు తెలిపారు. ఇటీవల గోపాలయ్యపై ఎలుగుబంటి దాడి చేసిందని, ఈ మేరకు మానవతా దృక్పథంతో అటవీ శాఖ సిబ్బంది ఈ ఆర్థిక సాయం అందించారు.



ఆర్థిక సాయాన్ని అందిస్తున్న డీఎఫ్‌వో వినీత్‌కుమార్

రెవెన్యూ క్రీడాపోటీలు అభినందనీయం

- ఆర్డీటీ ప్రోగ్రాం డైరెక్టర్ మాంచోఫెర్రర్
- రెండోరోజు కొనసాగిన రాష్ట్ర స్థాయి రెవెన్యూ క్రీడలు

అనంతపురం క్లాక్‌టవర్, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): నిత్యం ఒత్తిడితో కూడిన విధులు నిర్వర్తించే రెవెన్యూ ఉద్యోగులకు క్రీడా పోటీలు నిర్వహించడం అభినందనీయమని ఆర్డీటీ ప్రోగ్రాం డైరెక్టర్ మాంచో ఫెర్రర్ పేర్కొన్నారు. ఏడో రాష్ట్ర స్థాయి రెవెన్యూ క్రీడా, సాంస్కృతిక పోటీలు శనివారం అనంతపురం ఆర్డీటీ స్టేడియంలో రెండోరోజు కొనసాగాయి. ఏపీ రెవెన్యూ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు బొప్పరాజు వెంకటేశ్వర్లుతో కలిసి మాంచోఫెర్రర్‌లు పోటీలను పరిశీలించారు. ఈ సందర్భంగా మాంచోఫెర్రర్ మాట్లాడుతూ ఎంతో ప్రతిష్టాత్మకంగా రాయలసీమ ప్రాంతంలో అనంతపురం వేదికగా రాష్ట్రస్థాయి క్రీడా పోటీలు జరపడం శుభపరిణామమన్నారు. ప్రతి క్రీడాకారుడు జాతీయ స్థాయి పోటీలే లక్ష్యంగా ఆటల్లో గెలవాలని రెవెన్యూ ఉద్యోగులకు సూచించారు. క్రీడా స్ఫూర్తి ఉన్నప్పుడే భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిరోహించగలుగుతారన్నారు. క్రీడాపోటీలతో శారీరక దృఢత్వంతో పాటు మానసిక దృఢత్వం లభిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ శివనారాయణ శర్మ, ఆర్డీఓ మలోలా, ఎఫ్ఎస్ఓ రామకృష్ణారెడ్డి, ఏపీ రెవెన్యూ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి వెంకట రాజేష్, రెండు జిల్లాల అధ్యక్షులు దివాకర్ రావు, మధునాయక్, ఆర్డీఓలు కేశవనాయుడు, విశ్వనాథ్‌చౌదరి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు మల్లికార్జునుడు, ఆనంద్, రామ్మోహన్, తహసీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.

- వాలీబాల్ సెమీస్ పోటీల్లో విశాఖపట్నం జట్టుపై నంద్యాల గెలుపొందింది. మరో సెమీస్‌లో పార్వతీపురం జట్టుపై తూర్పు గోదావరి జట్టు విజయం సాధించింది. ఫైనల్స్‌లో నంద్యాల విజేతగా నిలిచింది.
- బ్యాడ్మింటన్ పోటీల్లో డబుల్స్‌లో విజయనగరంపై అన్నమయ్య, తిరుపతిపై తూర్పుగోదావరి జట్టు, సీసీఎల్ఏపై కాకినాడ జట్టు గెలుపొందాయి.
- పురుషుల సింగిల్స్‌లో కడపపై ప్రకాశం, తిరుపతిపై అంబేడ్కర్ కోనసీమ జట్టు గెలుపొంది ఫైనల్‌కు చేరాయి.
- మహిళల డబుల్స్‌లో అల్లూరి సీతారామరాజు జట్టుపై విజయనగరం, కడప జట్టుపై అనంతపురం గెలుపొంది ఫైనల్‌కు చేరాయి.
- మహిళా సింగిల్స్‌లో బాపట్లపై ప్రకాశం, అల్లూరి సీతారామరాజు జట్టుపై కాకినాడ, శ్రీకాకుళంపై తూర్పుగోదావరి జట్టు గెలుపొందాయి.
- టెన్నీకాయిట్‌లో విజయనగరంపై విశాఖపట్నం జట్టు గెలుపొందింది. అన్నమయ్యపై చిత్తూరు, అనంతపురంపై బాపట్ల, అనకాపల్లిపై కర్నూలు గెలుపొందాయి.
- టేబుల్‌టెన్నిస్ సింగిల్స్ పోటీల్లో అల్లూరి సీతారామరాజుపై అనంతపురం ఫారెస్ట్‌సెటిల్‌మెంట్ ఆఫీసర్ రామకృష్ణారెడ్డి విజయం సాధించారు. డబుల్స్‌లో అల్లూరి సీతారామరాజు జట్టుపై అనంతపురం గెలిచింది.

ఎర్రచందనం స్మగ్లింగ్‌ను అరికట్టడమే లక్ష్యంగా పనిచేయాలి

- స్మగ్లర్లపై పీడీ యాక్ట్ అమలు... థర్మల్ డ్రోన్ల ద్వారా నిఘా
- అధికార యంత్రాంగానికి డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఆదేశం

తిరుపతి, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఎర్రచందనం అక్రమ రవాణాను అరికట్టడమే లక్ష్యంగా పనిచేయాలని ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ అధికార యంత్రాంగాన్ని ఆదేశించారు. శనివారం సాయంత్రం తిరుపతి కలెక్టరేట్‌లో తిరుపతి, చిత్తూరు, అన్నమయ్య, నంద్యాల, నెల్లూరు, ప్రకాశం జిల్లాల కలెక్టర్లు, అటవీ, పోలీసు, టాస్క్‌ఫోర్స్ అధికారులతో ఆయన సమావేశమై ఎర్రచందనం అక్రమ రవాణాను అరికట్టే విషయమై సమీక్షించారు. ఎర్రచందనం అక్రమ రవాణాను అరికట్టేందుకు అడిషనల్ జాయింట్ పెట్రోలింగ్ క్యాంపులు, చెక్‌పోస్టులు, సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేసి పర్యవేక్షించాలని ఆదేశించారు. ఎర్రచందనం అక్రమ రవాణాకు పాల్పడే వారిపై పీడీ యాక్ట్ అమలు చేయాలన్నారు. ఇకపై అక్రమ రవాణా చేయాలంటే భయపడే విధంగా ఆ చర్యలుండాలని స్పష్టం చేశా రు. అటవీ శాఖలో ఖాళీ పోస్టుల భర్తీకి చర్యలు తీసుకోవాలన్నారు.

లోతుగా సమీక్షించిన డిప్యూటీ సీఎం

ఎర్రచందనం అక్రమ రవాణాను అరికట్టే విషయమై పట్టుదలతో ఉన్న డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ అధికారులతో లోతుగా సమీక్షించారు. తిరుపతి, చిత్తూరు, నెల్లూరు, ప్రకాశం, నంద్యాల, అన్నమయ్య జిల్లాల పరిధిలో ఉన్న 17,053 చదరపు కిలోమీటర్ల అటవీ ప్రాంతంలో 5,300 చదరపు కిలోమీటర్లలో ఎర్రచందనం వృక్షాలు విస్తరించి ఉన్నాయని అధికారులు వివరించారు. శేషాచల అడవుల నుంచి కూలీలు, మేస్త్రీలు, లాజిస్టిక్స్ సపోర్టర్లు, ట్రాన్స్‌పోర్టర్లు, గోడౌన్ కీపర్లు, ఎక్స్‌పోర్టుల ద్వారా ఎర్రచందనం అంతర్జాతీయ స్మగ్లర్లకు చేరుతోందని వివరించారు. అక్రమ రవాణాను అరికట్టడానికి తిరుపతి, పీలేరు, గుంటూరు, ఆత్మకూరులలో ఐదు ఫ్లయింగ్ స్క్వాడ్‌లు ఉన్నాయని వివరించారు. తరచూ అడవుల్లో కూంబింగ్ ఆపరేషన్లు చేపట్టి అక్రమ రవాణాను అడ్డుకుంటున్నామని చెప్పారు.

20 ఏళ్లలో 14 వేల టన్నుల ఎర్రచందనం స్వాధీనం

తాము తీసుకుంటున్న చర్యల కారణంగా 2004 నుంచి ఇప్పటి వరకు 14,204 టన్నుల ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నామని అటవీ, పోలీసు అధికారులు వివరించారు. 16,985 కేసులు నమోదయ్యాయని, 10,450 వాహనాలను సీజ్ చేశామని అన్నారు. మొత్తం 32,345 మందిని అరెస్టు చేశామని వెల్లడించారు. సమావేశంలో అటవీ శాఖ ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ డాక్టర్ పి.వి.చలపతిరావు, తిరుపతి కలెక్టర్ వెంకటేశ్వర్, ఎస్పీ సుబ్బరాయుడు, తిరుపతి కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ సెల్వం, అనంతపురం, కర్నూలు కన్జర్వేటర్లు యశోదాబాయి, కృష్ణమూర్తి, చిత్తూరు ఎస్పీ తుషార్ డూడీ, అన్నమయ్య జిల్లా ఎస్పీ ధీరజ్, కడప ఎస్పీ విశ్వనాథ్, తిరుపతి, ప్రకాశం, నెల్లూరు, కడప, అన్నమయ్య జిల్లాల డీఎఫ్‌వోలు పాల్గొన్నారు.



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్

ఆధిక్యతలో చిత్తూరు

- వెనుకంజలో అనంతపురం జట్టు



కడప స్పోర్ట్స్, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): కడపలో వివిధ జట్ల మధ్య జరుగుతున్న ఏసీఏ సౌత్‌జోన్ అండర్-14 మెన్ మల్టీడే ఇంటర్ డిస్ట్రిక్ట్ క్రికెట్ మ్యాచ్‌లలో భాగంగా శనివారం ఆట ముగిసే సమయానికి చిత్తూరు జట్టు కర్నూలు జట్టుపై 85 పరుగుల ఆధిక్యత సాధించింది. ఇదిలా వుండగా కడప-అనంతపురం జట్ల మధ్య సాగుతున్న మరో మ్యాచ్‌లో అనంతపురం 144 పరుగుల వెనుకంజలో వుంది.

కేవోఆర్ఎం మైదానంలో..

నగర శివారు ప్రాంతంలోని కేవోఆర్ఎం క్రికెట్ మైదానంలో చిత్తూరు-నెల్లూరు జట్ల మధ్య జరుగుతున్న మ్యాచ్‌లో టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన చిత్తూరు మొదటి ఇన్నింగ్స్‌లో కేవలం 28.3 ఓవర్లలో 63 పరుగులకు చేతులెత్తేసింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన కర్నూలు 34.3 ఓవర్లలో కేవలం 56 పరుగులకే కుప్పకూలింది. బౌలింగ్ విభాగంలో రక్షణ్‌సాయి (చిత్తూరు) 6వికెట్లు సాధించడం విశేషం. అనంతరం రెండో ఇన్నింగ్స్‌కు దిగిన చిత్తూరు జట్టు ఆట ముగిసే సమయానికి 26 ఓవర్లలో 2 వికెట్లు కోల్పోయి 78 పరుగులు చేసింది. దీంతో చిత్తూరు జట్టుకు ఇప్పటివరకూ 85 పరుగుల ఆధిక్యత లభించింది.

ఏసీఏ క్రికెట్ మైదానంలో..

నగర శివారులోని రిమ్స్ సమీపంలో ఉన్న వైయస్ రాజారెడ్డి ఏసీఏ క్రికెట్ స్టేడియంలో కడప- అనంతపురం జట్ల మధ్య సాగుతున్న మరో మ్యాచ్‌లో టాస్ నెగ్గిన కడప తన మొదటి ఇన్నింగ్స్‌లో బ్యాటింగ్ చేపట్టి 66.2 ఓవర్లలో 198 పరుగులకు ఆలౌట్ అయింది. ఇందులో ప్రశాంత్ 41 పరుగులు చేశారు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన అనంతపురం జట్టు ఆట ముగిసే సమయానికి 28 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి 54 పరుగులు చేసింది. దీంతో మరో 144 పరుగుల వెనుకంజలో అనంతపురం ఎదురీదుతోంది.



6 వికెట్లు తీసిన రక్షణ్ సాయి (చిత్తూరు)

ఆదర్శమూర్తి భక్త కనకదాసు : డీఆర్వో

కడప కలెక్టరేట్, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): తత్వవేత్త, కవి, సంగీతకారుడు, స్వరకర్త అయిన భక్త కనకదాసు సమాజాన్నే కాక భగవంతున్ని సైతం మెప్పించిన ఆదర్శమూర్తి అని జిల్లా రెవెన్యూ అధికారి విశ్వేశ్వరనాయుడు కొనియాడారు. శనివారం కలెక్టరేట్‌లోని వీజీఆర్ఎస్ హాలులో జిల్లా బీసీ సంక్షేమశాఖ ఆధ్వర్యంలో భక్త కనకదాసు జయంత్యుత్సవ కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథులుగా డీఆర్వోతో పాటు ఎస్డీసీ వెంకటపతి హాజరయ్యారు. ఈ సందర్భంగా డీఆర్వో మాట్లాడుతూ భక్త కనకదాసు చిన్న వయసులోనే నరసింహ స్తోత్రం, రామ ధ్యానమంత్రం, మోహన తరంగిని అనే కవిత్వాలను రచించారన్నారు. సాధారణ కన్నడ భాషల్లో కనకదాసు ఎన్నో కీర్తనలు రచించి ఆలపించారు. కీర్తనలు రచిస్తూ వేదాంతాన్ని అభ్యసించి గొప్ప కృష్ణ భక్తుడిగా పేరు గడించారన్నారు. ఆయన సైన్యంలో కూడా పని చేసినట్లు కీర్తనల ద్వారా తెలుస్తోందన్నారు. అలాగే కర్ణాటక సంగీతం కోసం ఎనలేని సేవలు చేశారన్నారు. అంతకుముందు డీఆర్వో భక్త కనకదాసు చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జిల్లా బీసీ వెల్ఫేర్ అధికారులు, బీసీ కార్పొరేషన్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.



భక్త కనకదాసు చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న డీఆర్వో విశ్వేశ్వరనాయుడు

రసవత్తరంగా బ్యాడ్మింటన్ క్వాలిఫై మ్యాచ్‌లు

- నేటి నుంచి మ్యాచ్‌లు ప్రారంభం

కడప స్పోర్ట్స్, నవంబర్ 8 (ఆంధ్రజ్యోతి): కడప డీఎస్ఏ ఇండోర్ స్టేడియంలో ఈనెల 8వ తేదీ శనివారం నుండి 11వ తేదీ వరకు ఆంధ్రప్రదేశ్ స్టేట్ మినీ (అండర్-11) బాల, బాలికల బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ పోటీలను జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ సారథ్యంలో నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా తొలిరోజున క్వాలిఫై మ్యాచ్‌లు జరిగాయి. ఇందులో రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుండి బాల, బాలికలు హాజరయ్యారు. క్వాలిఫై మ్యాచ్‌లలో ప్రతిభ కనబరచిన క్రీడాకారులు ఈనెల 9వ తేదీ ఆదివారం నుండి జరుగనున్న అసలైన సమరానికి సిద్ధం కావాల్సి వుంది. కాగా మెయిన్ డ్రాకు దాదాపు 250 మంది క్రీడాకారులు హాజరుకానున్నట్లు జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ చైర్మన్ షేక్ జిలానీ బాషా వెల్లడించారు.



క్వాలిఫై మ్యాచ్ ఆడుతున్న క్రీడాకారులు

పాముకాటుకు వ్యక్తి మృతి

పోరుమామిళ్ల, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): పాము కాటుకు చిలమల గురయ్య (43) మృతి చెందినట్లు ఎస్ఐ కొండారెడ్డి తెలిపారు. పోరుమామిళ్లలోని కాపువీధికి చెందిన గురయ్య ఈనెల 6వతేదీ రాత్రి 11గంటల సమయంలో తన ఇంటి ముందు కూర్చుని ఉండగా విష పురుగు అతని కుడికాలు బొటనవేలుకు కాటు వేసిందని, అయితే వారు దానిని తేలిగ్గా తీసుకుని నిద్రపోయారన్నారు. అయితే మరుసటిరోజు కాటు వేసిన చోట కమిలి ఉండడం, నల్లగా మారడం గమనించి వెంటనే అతని కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం కడప రిమ్స్‌కు తరలించారు. అక్కడ వైద్యులు పరీక్షించి రక్తపరీక్షలు నిర్వహించి విషానికి విరుగుడు ఇచ్చారు. అయినా చికిత్స పొందుతున్న సమయంలో కోలుకోలేకపోవడంతో 7న మృతి చెందాడని కుటుంబ సభ్యులు తెలిపారన్నారు. వారిచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో యువకుడు మృతి

పులివెందుల, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): పులివెందుల పట్టణ సమీపంలోని గోవిందరాజ టెక్స్‌టైల్స్‌లో తమిళనాడు కు చెందిన శరవణ్ (35) అనే కార్మికుడు అనుమానాస్పద స్థితిలో మృతిచెందాడు. శుక్ర వారం అర్ధరాత్రి శరవణ్ టెక్స్ టైల్స్‌లోని ఓ గదిలో ఉరి వేసు కొని మృతి చెందినట్లు తెలిసింది. కానీ ఈ విషయం బయటకు రాకుండా గోవిందరాజ టెక్స్‌టైల్స్ యాజమాన్యం గోప్యంగా ఉంచింది. శనివారం ఈ సంఘటనపై పోలీసులకు సమాచారం అందడంతో సంఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరించినట్లు తెలిసింది. దీనిపై మృతుడి బంధువు ల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేస్తామని పోలీసులు తెలిపారు.



మృతి చెందిన శరవణ్

రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్‌లో జిల్లా క్రీడాకారుల ప్రతిభ



అథ్లెటిక్స్‌లో సత్తా చాటిన జిల్లా క్రీడాకారులు

కడప స్పోర్ట్స్, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళం జిల్లా గోవిందాపురం ఉన్నత పాఠశాలలో ఈనెల 8 నుండి 9వ తేదీ వరకు జరుగుతున్న 69వ రాష్ట్ర స్థాయి స్కూల్‌గేమ్స్ అథ్లెటిక్స్ క్రీడా పోటీలలో జిల్లా క్రీడాకారులు సత్తా చాటి ప్రతిభ కనబరచడం హర్షణీయమని జిల్లా వ్యాయామ ఉపాధ్యాయ సంఘం అధ్యక్షుడు బి.శివశంకర్‌రెడ్డి, జిల్లా స్కూల్‌గేమ్స్ కార్యదర్శి చంద్రావతి తెలిపారు. ఇందులో అండర్-14 బాల, బాలికల హైజంప్ విభాగంలో ఎస్.కె.జాస్మిన్ ద్వితీయ స్థానం, 400 మీటర్ల రన్నింగ్ విభాగంలో రాకేశ్ బంగారు పతకంతో పాటు 100 మీటర్ల విభాగంలో సైతం తృతీయ స్థానంలో నిలిచారన్నారు. కాగా 100 మీటర్లతో పాటుగా 400 మీటర్ల రన్నింగ్ విభాగంలో వైష్ణవి తృతీయ విజేతగా ఎంపిక కావడం అభినందనీయమన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు మోడల్‌స్కూలు విద్యార్థిని

వల్లూరు, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): కడప నగరంలోని మున్సిపల్ ఉర్దూ హైస్కూలులో శనివారం జరిగిన జిల్లాస్థాయి ఎస్‌జీఎఫ్ అండర్-17 ఖోఖో పోటీల్లో ఏపీమోడల్ స్కూలు, కళాశాల విద్యార్థిని ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైందని కళాశాల ప్రిన్సిపాల్ సురేశ్‌బాబు తెలిపారు. మండలంలోని గంగాయపల్లె మోడల్ స్కూలు, కళాశాలలో ఇంటర్మీడియట్ ఎంపీపీ మొదటి సంవత్సరం చదువుతున్న మోక్షిత రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు అర్హత సాధించిందన్నారు. ఈ సందర్భంగా విద్యార్థినిని ప్రిన్సిపాల్ సురేశ్‌బాబు, పీడీ సుశీలమ్మ, కళాశాల సిబ్బంది అభినందించారు.



దీపోత్సవం వ్యాఖ్యాతగా చంద్రశేఖరరావుకు ఆహ్వానం



కడప ఎడ్యుకేషన్, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): కడపకు చెందిన ఆధ్యాత్మిక రచయిత, ప్రవచనకర్త డాక్టర్ ఎంఎల్ఎన్ చంద్రశేఖర్‌రావుకు శ్రీశైలంలో నిర్వహించనున్న దీపోత్సవ కార్యక్రమానికి వ్యాఖ్యాతగా వ్యవహరించాలని శనివారం శ్రీశైలం ఆలయ కార్యనిర్వహణాధికారి నుంచి ఆహ్వానం అందింది. ఈనెల 10వ తేదీన శ్రీశైలం ఆలయ పుష్కరిణి వద్ద జరిగే లక్ష దీపోత్సవం, దశవిధ హారతుల కార్యక్రమాలకు వ్యాఖ్యాతగా వ్యవహరించాలని ఈ సందర్భంగా కోరారు. పెండ్లిమర్రి ఆదర్శ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌గా పనిచేస్తున్న చంద్రశేఖరరావు 40 ఆధ్యాత్మిక గ్రంథాలు, 12 పాఠ్యపుస్తకాలు రచించారు. తిరుమల, శ్రీశైలం వంటి పవిత్ర క్షేత్రాల్లో ప్రవచనాలు, వ్యాఖ్యానాలు చేసిన ఆయనకు ఈ ఆహ్వానం రావడం పట్ల కడప సాహితీవేత్తలు అభినందనలు తెలిపారు.

అప్పులు చేయడంలో వైసీపీ, టీడీపీ దొందూదొందే

- రాజ్యసభ మాజీ సభ్యుడు తులసిరెడ్డి



కడప కలెక్టరేట్, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): అప్పులు చేయడంలో వైసీపీ, టీడీపీ దొందూదొందే అని మాజీ రాజ్యసభ సభ్యుడు, పీసీసీ అధికార ప్రతినిధి తులసిరెడ్డి ధ్వజమెత్తారు. శనివారం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ గత ప్రభుత్వం శక్తికి మించి అప్పులు చేసి రాష్ట్రాన్ని దివాలా తీస్తే అదేబాటలో ఇపుడు కూటమి సర్కారు అప్పులు చేస్తోందని విమర్శించారు. కూటమి సర్కారు 17 నెలల పాలనలో రూ.2.27 లక్షల కోట్లు అప్పులు తెచ్చిందని, ఇది బడ్జెట్‌కు రెండింతలన్నారు. రాజధాని నిర్మాణం పేరుతో కూటమి సర్కారు ప్రజలపై భారం మోపిందన్నారు. మోదీ 11 ఏళ్ల పాలనలో పిల్లికి భిక్షం వేసినట్లుగా రూ.1500 కోట్లు గ్రాంట్ రూపంలో ఇవ్వడం తీరని అన్యాయమన్నారు. డబుల్ ఇంజన్ సర్కారు ట్రబుల్ ఇంజన్ సర్కారుగా మిగిలిందని ఎద్దేవా చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు సలావుద్దీన్, ప్రసాద్ గౌడ్, కుల్లాయప్ప, మైనుద్దీన్, సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

ప్రాచీనచరిత్రను అధ్యయనం చేయాలి



క్షేత్రదర్శనం బస్సును ప్రారంభిస్తున్న ఇంటాక్ రాష్ట్ర కన్వీనర్ లక్ష్మీనారాయణ

కడప ఎడ్యుకేషన్,నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): మన ప్రాచీన చరిత్ర, సంస్కృతి, వారసత్వ సంపదను ప్రతి ఒక్కరూ అధ్యయనం చేయాలని ఇంటాక్ రాష్ట్ర కన్వీనర్ ఎస్వీఎస్ లక్ష్మీనారాయణ అన్నారు. శనివారం ఇంటాక్ కడప చాప్టర్ కన్వీనర్ లయన్ కె.చిన్నపరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన క్షేత్ర సందర్శనలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా సభ్యులు, విద్యార్థులు పుష్పగిరి, ఒంటిమిట్ట, నందలూరు ఆలయాలను సందర్శించారు.

మానసిక ఉల్లాసానికి, శారీరక దృఢత్వానికి క్రీడలు అవసరం



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి

పులివెందుల, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి):మానసిక ఉల్లాసానికి, శారీరక దృఢత్వానికి క్రీడలు ఉపయోగపడతాయని ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం పులివెందులలోని వైఎస్సార్ క్రీడా ప్రాంగణంలో 3వ సబ్ జూనియర్ బాలుర, బాలికల కబడ్డీ చాంపియన్‌షిప్ క్వార్టర్ ఫైనల్ పోటీలను ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో రాష్ట్ర కబడ్డీ అసోసియేషన్ సెక్రటరీ శ్రీకాంత్, వర్కింగ్ ప్రెసిడెంట్ అర్జున్‌రావు, జిల్లా అసోసియేషన్ అధ్యక్షుడు గురుశేఖర్,సెక్రటరీ వెంకటసుబ్బయ్య పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో వేంకటేశ్వరస్వామి ప్రాకారోత్సవం



ప్రాకారోత్సవ పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

వేంపల్లె, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): వేంపల్లె పాపాఘ్నినది ఒడ్డున ఎద్దుల కొండపై వెలసిన లక్ష్మీవృషభాచలేశ్వరస్వామి అనుబంధ నాలుగురోడ కూడలిలో ఉన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రాకారోత్సవ కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వేంకటేశ్వరస్వామికి కార్తీకమాసం శనివారం పురస్కరించుకొని పూజలు చేశారు. ఆలయ చైర్మన్ పి.వెంకటరమణ ఆధ్వర్యంలో పాలక మండలి సభ్యులు ప్రాకారోత్సవం పాల్గొన్నారు.భక్తులు పాల్గొని తీర్థప్రసాదాలు అందుకుఆన్నరు.

ఎస్టీయూ నూతన నగర అధ్యక్షుడిగా సాదిక్ అలీ

కడప ఎడ్యుకేషన్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఎస్టీయూ నగర అధ్యక్షుడుగా సాదిక్ అలీ ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. శనివారం కడప నగరం ఎస్టీయూ భవన్‌లో జరిగిన కడప అర్బన్,రూరల్ రీజనల్ కౌన్సిల్ సమావేశంలో రీజియన్ కన్వీనర్ అబ్దుల్ వాజిద్ అధ్యక్షతన నూతన కార్యవర్గాన్ని ఎంచుకున్నారు. నగర అధ్యక్షుడిగా ఎస్.సాదిక్ అలీ, ప్రధాన కార్యదర్శిగా టి.సత్యనారాయణ, ఆర్థిక కార్యదర్శిగా డాక్టర్ శుగుఫ్తా యస్మీన్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారిగా కె.సురేష్‌బాబు, పరిశీలకుడుగా కె.బాలగంగిరెడ్డి వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు ఎస్.ఎం.డి.ఇలియాస్ బాష తదితరులు పాల్గొన్నారు.

'జీఓ 590ని తక్షణం ఉపసంహరించుకోవాలి'

పులివెందుల రూరల్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ వైద్య కళాశాలలను పీపీపీ విధానంలో ప్రైవేట్ సంస్థలకు అప్పగించేందుకు రాష్ట్రప్రభుత్వం తీసుకొచ్చిన జీఓ నెంబరు 590ని తక్షణం రాష్ట్ర ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని ఆలిండియా స్టూడెంట్స్ అసోసియేషన్ (ఐసా) నాయకులు డిమాండ్ చేశారు. పేద విద్యార్థులను వైద్యవిద్యకు దూరం చేస్తోందని ఆందోళన వ్యక్తం చేస్తూ ఐసా ఆధ్వర్యంలో పులివెందుల మినీ సెక్రటేరియట్ ముందు శనివారం నిరాహార దీక్షచేపట్టారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి ఎస్.నాగార్జున, రాష్ట్ర ఉపాధ్యక్షుడు శివకుమార్, లవ్‌కుమార్, జిల్లా కో-కన్వీనర్ దినేష్, ప్రజా సంఘాల నాయకులు అంబేడ్కర్‌వాదులు తదితరులు పాల్గొన్నారు.

రిమ్స్‌లో అంతర్జాతీయ రేడియాలజీ దినోత్సవం



కేక్ కట్ చేస్తున్న డాక్టర్ లక్ష్మీసుశీల

కడప సెవెన్‌రోడ్స్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): రిమ్స్ జనరల్ ఆసుపత్రి రేడియాలజీ విభాగంలో శనివారం అంతర్జాతీయ రేడియాలజీ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఇన్‌చార్జి సూపరింటెండెంట్ డాక్టర్ లక్ష్మీ సుశీల, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ విజయభాస్కర్‌రెడ్డి ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా రేడియాలజీ ఆవిష్కర్త సర్ విల్హెల్మ్ రాంట్జెన్‌కు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఎక్స్‌రేలు ఎలా కనుగొనబడ్డాయి, రేడియాలజీ రంగం అభివృద్ధి ఎలా సాగింది అనే అంశాలపై పవర్‌పాయింట్ ప్రజెంటేషన్‌ను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రేడియాలజీ విభాగాధిపతి డాక్టర్ శారద, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ రాజేంద్రనాయుడు, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ డేవిడ్, పీజీ విద్యార్థులు, రేడియోగ్రాఫర్లు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

కైలాసవాసా... ఇదేమి కంపు నాయనా..!

- నదిలోకి స్నానానికి వెళ్లాలంటే ముక్కు మూసుకోవాల్సిందేనా..?
- ఎంతకాలమీ అవస్థ..?



చెన్నూరు వద్ద నదిలోకి దిగే చోట ఉన్న వ్యర్థాల కుప్పలు

చెన్నూరు, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : కార్తీక మాసం సందర్భంగా చెన్నూరు వద్ద పెన్నానదిలో స్నానానికి వెళ్లేవారికి ఆ నది ఒడ్డునే పేరుకు పోయిన చెత్తకుప్పలు దుర్వాసన వెదజల్లుతూ ఇబ్బందులు పెడుతున్నాయి. ప్రతి ఏటా కార్తీక మాసంలో తెల్లవారుజామున 3గంటల నుంచే ప్రజలు నదీ స్నానానికి వెళుతుంటారు. ముఖ్యంగా చెన్నూరు - ఖాజీపేట వెళ్లే మధ్యలో ఉన్న పెన్నానదిపై ఉన్న వంతెన కింది భాగంలో గ్రామ పంచాయతీలో పలు చోట్ల సేకరించి తెచ్చిన పలురకాల చెత్త, ఇతర వ్యర్థాలు కుప్పలు తెప్పలుగా అక్కడ పోస్తుంటారు. పైగా రోడ్డు ప్రమాదంలో చనిపోయిన జంతువులు (ముఖ్యంగా పందులు, కుక్కలు) చికెన్ సెంటర్ల నుంచి తొలగించిన వ్యర్థాలు కూడా ఇదే ప్రాంతంలో వేస్తుంటారు. చినుకు పడితే ఈ వ్యర్థాలన్నీ కుళ్లిపోయి విపరీతమైన దుర్వాసన వస్తాయి. దీంతో పాటు ఈ కంపులోకి ఎక్కడెక్కడో ఉన్న పందులన్నీ వచ్చి చేరడంతో ఆ వ్యర్థాలను చెల్లాచెదురు చేసి మరింత దుర్వాసన వచ్చేట్లు చేస్తున్నాయి. వీటి వల్ల ఆ దారిన పోయే వారికి సైతం ముక్కుపుటాలు బద్దలయ్యే దుర్వాసన వెదజల్లుతుండగా నదిలోకి స్నానానికి వెళ్లేవారు శివా...ఇదేమి కర్మయ్యా మాకు, పవిత్రమైన పెన్నాలో స్నానం చేసేందుకు కూడా మాకు ఇబ్బందేనా, ఎంతకాలమీ స్నానపు కష్టాలు, ఈ ప్రాంతం పరిశుభ్రమయ్యేదెప్పుడు, ప్రశాంతంగా స్నానం చేసి శివుని దర్శనం చేసుకునేదెప్పుడు అంటూ బాధలు వ్యక్తం చేస్తున్నారు. అదేదో నిన్నా, మొన్న ఉన్న పరిస్థితి కాదు, నాలుగైదేళ్లుగా క్రమేపీ అక్కడ మురుగు కుప్పలు కొండల్లా పేరుకు పోయాయి. అధికారులు చర్యలు తీసుకుని కనీసం కార్తీక మాసంలో అయినా నదీ స్నానానికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా చేయాలని ప్రజలు కోరుతున్నారు.

రైతులను హడలెత్తిస్తున్న కేబుల్ దొంగలు



పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తున్న రైతులు

లింగాల, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలో కొన్ని రోజులుగా పొలాల్లో విద్యుత్ మోటార్లకు అమర్చిన కేబుల్‌ను దొంగలు ఎత్తుకెళ్లతుం డడంతో రైతులు భయాందోళనకు గురవుతున్నారు. శుక్రవారం రాత్రి కోమన్నూతల గ్రామంలో సుమారు 30 మంది రైతుల కేబుళ్లను దొంగలు ఎత్తుకెళ్లారని, ఆ మేరకు పోలీస్‌స్టేషన్‌లో రైతులు శనివారం ఫిర్యాదు చేశారు. రైతులు ఎస్ఐ అనిల్‌కుమార్‌తో మాట్లాడుతూ దొంగలు కొద్దిరోజుల వ్యవధిలో మళ్లీ దొంగతనం జరుగుతోందని రైతులు తెలిపారు. ఎస్ఐ మాట్లాడుతూ దొంగతనాలు చేస్తున్న వారిని గుర్తించామని వారిని అరెస్టు చేసి నిరోదిస్తామని రైతులకు హామీ ఇచ్చారు.

కేబుల్ దొంగలను వెంటనే పట్టుకోవాలి : కేబుల్ వైర్ దొంగలను వెంటనే పట్టుకొని తమకు న్యాయం చేయాలని రైతులు పోలీస్‌స్టేషన్ ఎదుట శనివారం రోడ్డుపై బైఠాయించారు. వారికి మద్దతు గా ఎంపీ అవినాశ్‌రెడ్డి రోడ్డుపైకూర్చొని రైతు సమస్యలను ప్రస్తావించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని కోమన్నూతల, అంబకపల్లె, మురారిచింతల, గుణకనపల్లె,హీరోజ్‌పురం తదితర గ్రామాలలో ఇటీవల వ్యవసాయ మోటార్లకు అమర్చిన కేబుళ్లను దొంగలు రాత్రి వేళల్లో ఎత్తుకెళ్తుండడంతో రైతులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు.

రెండు నెలలుగా వారం పదిరోజుల వ్యవధిలో దొంగలు కేబుళ్ల దోచుకెళ్తున్నారని పోలీసులకు ఫిర్యాదు చేసిన కూడా దొంగలను పట్టుకోలేక పోయారని అన్నారు. ఎస్ఐ అనిల్‌కుమార్ మాట్లాడుతూ దొంగలను, కేబుల్ కొన్నవారిని గుర్తించామని ఒకటి రెండు రోజుల్లో రికవరీచేసి రైతులకు అప్పగిస్తామని హామీ ఇవ్వడంతో ధర్నా విరమించారు.

11న పీఎఫ్ కార్యాలయం ఎదుట ధర్నా

కడప మారుతీనగర్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): పెన్షనర్ల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 11వ తేదీ ఉదయం 10-30 గంటలకు నగర పీఎఫ్ కార్యాలయం ఎదుట ధర్నా తలపెట్టినట్లు ఏపీఎస్ఆర్టీసీ రిటైర్డ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ కడప రీజియన్ కార్యదర్శి వై. రవీంద్రనాథ్ వర్మ, రాష్ట్ర నాయకులు రాజారెడ్డి, సోమశేఖర్ రెడ్డి జిల్లా అధ్యక్షుడు సుబ్బారెడ్డి తెలిపారు. ఆ మేరకు శనివారం స్థానిక అసోసియేషన్ జిల్లా కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు అనంతపురం, చిత్తూరు, కర్నూలు, కడప జిల్లాల విశ్రాంత ఆర్టీసీ ఉద్యోగులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని కోరారు.

ఘనంగా లింగమూర్తి వర్ధంతి

కడప నాగరాజుపేట, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : కమ్యూనిస్టు సీనియర్ నాయకుడి వర్ధంతిని శనివారం ఆర్సీపీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాయలసీమ కమ్యూనిస్టు పార్టీ రాష్ట్ర కార్యదర్శి రవిశంకర్‌రెడ్డి, మక్బుల్ బాష, సీనియర్ నాయకులు సావంత్ సుధాకర్, ఎస్‌డబ్ల్యూఎఫ్ మాజీ నాయకులు సిద్దయ్య, ఆర్సీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

వేర్‌హౌస్ గోడౌన్ తనిఖీ

ప్రొద్దుటూరు టౌన్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): రూరల్ పరిధిలో ఉన్న సర్విరెడ్డిపల్లెలోని వేర్‌హౌస్ గోడౌన్‌ను ఏపీరాష్ట్ర వేర్‌హౌస్ డైరెక్టర్ మురికినాటి శ్రీధర్ శనివారం ఆకస్మిక తనిఖీ చేశారు. గోడౌన్‌లో ఉన్న స్టాక్‌పాయింట్‌ను పరిశీలించారు. గోడౌన్‌లోని రికార్డులను తనిఖీ చేసి సిబ్బందికి సూచనలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పేద ప్రజలకు ఇచ్చే అన్ని రకాల సరుకులను భద్రంగా కాపాడి సకాలంలో ఆయా రేషన్‌షాపులకు చేరవేయాలని సూచించారు. గోడౌన్లలో రికార్డులు సక్రమంగా నిర్వహించాలని ఆదేశించారు.

వేతనాల కోసం ఎదురుచూపులు



డ్వామా పీడీకి వినతిపత్రం అందిస్తున్న సిబ్బంది

కడప ఎన్టీఆర్ సర్కిల్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : ఉపాధి హామీ పథకంలో సాంకేతిక సహాయకులు, బీఎఫ్‌టీలుగా పనిచేస్తున్న సిబ్బందికి నెలల తరబడి వేతనాల కోసం ఎదురు చూడాల్సిన పరిస్థితి వస్తోందని సాంకేతిక సహాయకుల అధ్యక్షుడు మునిశేఖర్‌రాజు ఆవేదన వ్యక్తం చేశారు. తమ తోటి ఎంసీసీలో పనిచేస్తున్న ఇతరుల క్యాడర్ల అయిన ఎఫ్ఏసీవో, ఏపీవోలు, ఏసీలు, ప్లాంటేషన్ సూపర్‌వైజర్లు ఎంటీసీలు తదితర సిబ్బందికి అడ్మిన్ కాస్ట్ నుంచి సకాలంలో జీతాలు చెల్లిస్తున్నారని తెలిపారు. టీఏ, బీఎఫ్‌టీలకు మాత్రం మెటీరియల్ కాస్ట్ నుంచి ఇవ్వడం వల్ల తమకు జీతాలు సరైన సమయంలో రాక చాలా ఇబ్బందులకు గురవుతున్నామని వివరించారు. తమకు కూడా అందరు లాగే అడ్మిన్ కాస్ట్ నుంచి జీతాలు చెల్లించే విధంగా పథక సంచాలకుడు ఆదిశేషారెడ్డి చొరవ తీసుకుని కమిషనరు దృష్టికి తమ బాధలు తెలపాలని విన్నవించారు. ఈ మేరకు డ్వామా పీడీకి వినతిపత్రం అందించినట్లు ఆయన వివరించారు. అనంతరం సాంకేతిక సహాయకులు, బీఎఫ్‌టీలు, యూనియన్ ప్రతినిధులు జనరల్ సెక్రటరీ పెంచలయ్య, సెక్రటరీ ప్రసాద్, ట్రెజరర్ ప్రసాద్ తదితరులు నిరసన వ్యక్తం చేశారు.

రహదారి ప్రమాదాల నియంత్రణే లక్ష్యం



అవగాహన కల్పిస్తున్న రిమ్స్ ఎస్ఐ

కడప క్రైం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : పోలీసు శాఖ ఆధ్వర్యంలో రోడ్డు భద్రతపై విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా వివిధ పోలీసుస్టేషన్ల పరిధిలో ఈ కార్యక్రమాలు జరిగాయి. రోడ్డు భద్రతా నియమాలు పాటించడం ద్వారా ప్రమాదాలు గణనీయగా తగించవచ్చని పోలీసు అధికారులు తెలిపారు. వాహనదారులకు పలు సూచనలు చేశారు.

వడ్డెరుల అభివృద్ధికి శ్రమిస్తా

నగర కమిటీ అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం

కడప మారుతీనగర్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): నగరంలోని వడ్డెరులు ప్రధానంగా ఎదుర్కొంటున్న సమస్యల ను పరిష్కరించడంతోపాటుగా వారి అభివృద్ధికి శ్రమిస్తానని వడ్డెర సంక్షేమ సంఘం నగర నూతన అధ్యక్షుడు రాయచోటి సుబ్రహ్మణ్యం స్పష్టం చేశారు. శనివారం స్థానిక పాతరిమ్స్ లో ఉన్న బీసీ భవన్‌లో జిల్లా వడ్డెర సంక్షేమ సంఘం కార్యవర్గ కమిటీ సభ్యుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆ సంఘం నాయకులు నగర కమిటీ అధ్యక్షుడుగా సుబ్రహ్మణ్యంను ఏకగ్రీవంగా ఎన్నిక చేశారు. కార్యక్రమంలో వడ్డెర సంక్షేమ సంఘం కార్పొరేషన్ డైరెక్టర్ వెంకటసుబ్బయ్య, సంఘం నాయకులు లింగమూర్తి, జానకిరామ్, శ్రీనివాసులు, శ్రీను, వెంకట్, మల్లికార్జున, రామకృష్ణ పాల్గొన్నారు.

ఉక్కాయపల్లిలోని చెత్తాచెదారాలను తరలించాలి



ఉక్కాయపల్లిలో వేస్ట్ మేనేజ్‌మెంట్‌ను పరిశీలిస్తున్న కాంగ్రెస్ నేతలు

కడప కలెక్టరేట్, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): ప్రజలకు తీవ్ర ఇబ్బందిగా మారిన ఉక్కాయపల్లి వేస్ట్ మేనేజ్మెంట్‌ను నగర శివార్లకు తరలించాలని జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి సయ్యద్ గౌస్‌పీర్ డిమాండ్ చేశారు. శనివారం జిల్లా కాంగ్రెస్ నేతలు ఉక్కాయపల్లిలో ప్రజలకు దుర్వాసన కల్గిస్తున్న చెత్తా చెదారాలను పరిశీలించారు. ఈసందర్భంగా గౌస్‌పీర్ మాట్లాడుతూ నగరంలో సేకరించిన చెత్తా చెదారాన్ని రీ సైక్లింగ్ పేరుతో ఇక్కడ నిల్వలు పెట్టడం వల్ల చుట్టు ప్రక్కల ప్రజలు,వాహనదారులకు తీవ్ర దుర్వాసన వస్తోందన్నారు. కానీ కార్పొరేషన్ అధికారులు వెంటనే తరలించాలని డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో సిరాజుద్దీన్,ముబారక్, అంజన్‌కుమార్, జుబేర్‌అలీ,సిద్దిక్ తదితరులు పాల్గొన్నారు.

15న కోటి దీపోత్సవం

బద్వేలు రూరల్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : మున్సిపల్ పరిధి లోని వల్లెర వారి పల్ల గ్రామంలో వెలసిన లక్ష్మీనరసింహ స్వామి వారి ఆలయంలో ఈ నెల 15న కోటి దీపోత్సవ కార్యక్ర మం నిర్వహిస్తున్నట్లు ఆలయ ప్రధాన అర్చకుడు పెంచలయ్య స్వామి తెలిపా రు. అలాగే శనివారం స్వామివారికి ప్రత్యేక పూజాభిషేకాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పట్టణ గ్రామీణ ప్రాం త ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని స్వా మివారిని దర్శించుకున్నారు. వల్లెరవారిపల్లెకు చెందిన పూరంరెడ్డి సుబ్బరామిరెడ్డి కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో మధ్యా హ్నం భక్తులకు అన్నదానం నిర్వహించారు.

కార్యకర్తలకు అండగా టీడీపీ : ఎమ్మెల్యే



చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే పుత్తా క్రిష్ణచైతన్యరెడ్డి

పెండ్లిమర్రి, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): కార్యకర్తలకు అండగా టీడీపీ నిలుస్తోందని ఎమ్మెల్యే పుత్తా కృష్ణచైతన్యరెడ్డి పేర్కొన్నారు. ప్రమాదంలో మరణించిన టీడీపీ కార్యకర్తల కుటుంబాలకు ఎమ్మెల్యే చెక్కులు పంపిణీ చేశారు. మండలంలోని కొత్తగిరిపల్లె గ్రామానికి చెందిన పేర్ల చిన్న మల్లారెడ్డి ప్రమాదంలో మరణించారు. ఆయనకు పార్టీ సభ్యత్వం ఉన్నందున భార్య నారాయణమ్మకు రూ.5లక్షల చెక్కును అందించారు. అలాగే మొయిళ్లకాల్వ పంచాయతీ ఎస్.రామాపురం గ్రామానికి చెందిన తొండూరు బాదుల్లా చనిపోయినందున ఆయన భార్య ఫాతిమాకు రూ.5లక్షల చెక్కును అందించారు.

'రాష్ట్ర ప్రజలను మోసగిస్తున్న ప్రభుత్వం'

కమలాపురం రూరల్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం ప్రజలను మోసగిస్తూ పేద ప్రజలకు ఉచిత వైద్యాన్ని దూరం చేసేందుకు కంకణం కట్టుకుందని వైసీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే రవీంద్రనాథరెడ్డి అన్నారు. పెద్దచెప్పలి గ్రామంలో శనివారం సాయంత్రం రాష్ట్ర సీఎస్సీ కౌన్సిల్ మెంబరు కాశిభట్ల సత్యసాయినాథశర్మ ఆధ్వర్యంలో రచ్చబండ కర్యాక్రమం కోటి సంతకాల సేకరణ నిర్వహించారు. కార్యక్రమంలో వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

'అప్పుల రాష్ట్రంగా మార్చిన కూటమి ప్రభుత్వం'

కడప ఎర్రముక్కపల్లె, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): కూటమి పాలనలో రాష్ట్రాన్ని అప్పుల రాష్ట్రంగా మార్చిందని వైసీపీ జిల్లా అధ్యక్షుడు పి.రవీంద్రనాథ్‌రెడ్డి, మాజీ ఉప ముఖ్యమంత్రి అంజాద్‌బాష తీవ్రంగా విమర్శించారు. శనివారం కడపలోని వైసీపీ జిల్లా కార్యాలయంలో వారు విలేకరులతో మాట్లాడుతూ మెడికల్ కళాశాలలను పీపీపీ పేరుతో ప్రైవేట్ వ్యక్తులకు అప్పగించాలను కోవడం దారుణమన్నారు. వైసీపీనేతలు పులి సునీల్‌కుమార్, షఫీ, నిత్యానందరెడ్డి, కిషోర్, ఇలియాస్ పాల్గొన్నారు.

కనకదాస సేవలు ఆదర్శనీయం



కడప క్రైం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : సామాజిక సంస్కర్త, గొప్ప కవి శ్రీ భక్త కనకదాస జయంతి వేడుకలను శనివారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అదనపు ఎస్పీ రమణయ్యహాజరయ్యారు. సామాజిక రుగ్మతల నిర్మూలనకు కనకదాస్ చేసిన సేవలు శ్లాఘనీయమన్నారు. ఈకార్యక్రమంలో ఆర్ఐలు శివరాముడు, టైటస్, సోమశేఖర్‌నాయక్, శ్రీశైలరెడ్డి, ఆర్ఎస్ఐలు వెంకటేశ్వర్లు, చూడామణి వర్మ, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

పాలకుల నిర్లక్ష్యంతోనే వెనుకబడిన బీసీలు

సమగ్ర కులగణన సాధనకోసం మరో ఉద్యమానికి సిద్ధం కావాలి ● బీసీ యునైటెడ్ నేషనల్ ఫ్రంట్ రాష్ట్ర అధ్యక్షుడు ఓబులేసు



సభలో మాట్లాడుతున్న డీఎం ఓబులేసు

కడప మారుతీనగర్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 78 సంవత్సరాలు గడుస్తున్నా నాటి నుంచి నేటి వరకు పాలకుల నిర్లక్ష్యం కారణంగా బీసీ కులాలు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్లుగా వెనుకబడివున్నారని బీసీ యునైటెడ్ ఫ్రంట్ రాష్ట్ర అధ్యక్షుడు డీఎం ఓబులేసు ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల సమయంలో ఓటు బ్యాంకు రాజకీయాలకు బీసీలను పావులుగా వాడుకోవడం తప్ప సీట్ల కేటాయింపులో దగా చేస్తున్నారని పాలకులపై నిప్పులు చెరిగారు. బీసీ యునైటెడ్ నేషనల్ ఫ్రంట్ ఆధ్వర్యంలో శనివారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో బీసీ రాజకీయ చైతన్య రాష్ట్ర మహాసభ నిర్వహించారు. సభకు డీఎం ఓబులేసు అధ్యక్షోపన్యాసం చేసి మాట్లాడుతూ జనాభా ప్రాతిపదికన పార్లమెంట్, అసెంబ్లీ సీట్లను దేశ వ్యాపితంగా కేటాయిస్తేనే బీసీలకు సరైన న్యాయం జరుగుతుందన్నారు. ఇప్పటికైనా సమగ్ర కులగణన సాధనకు మరో పోరాటానికి బీసీలు సన్నద్ధం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జేసీఐపీ జాతీయ అధ్యక్షుడు అవ్వారు మల్లికార్జున, పలు పార్టీల ప్రజా సంఘాల ప్రతినిధులు దేవర శ్రీకృష్ణ, ప్రతాప్‌రెడ్డి, పి.వి.రమణయ్య, సీ.ఆర్.వీ. ప్రసాద్, డబ్ల్యూవీ రాము, సంగటి మనోహర్, రమణ, ఆంజనేయులు, నాగేశ్వర రావు, కైపు రామాంజనేయులు పాల్గొన్నారు.

15న కోటి దీపోత్సవం


అలంకరణలో లక్ష్మీనరసింహస్వామి

బద్వేలు రూరల్, నవంబరు 8 (ఆంధ్ర జ్యోతి) : మున్సిపల్ పరిధి లోని వల్లెర వారి పల్ల గ్రామంలో వెలసిన లక్ష్మీనర సింహ స్వామి వారి ఆలయంలో ఈ నెల 15న కోటి దీపోత్సవ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆలయ ప్రధాన అర్చకుడు పెంచలయ్య స్వామి తెలిపారు. అలాగే శనివారం స్వామివారికి ప్రత్యేక పూజాభిషేకాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పట్టణ గ్రామీణ ప్రాంత ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. వల్లెరవారిపల్లెకు చెందిన పూరంరెడ్డి సుబ్బరామిరెడ్డి కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో మధ్యాహ్నం భక్తులకు అన్నదానం నిర్వహించారు.

పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేసిన డీఎస్పీ


పోలీస్‌స్టేషన్‌లో రికార్డులు తనిఖీ చేస్తున్న డీఎస్పీ వెంకటేశ్వరరావు

కొండాపురం, నవంబరు 8 (ఆంధ్ర జ్యోతి): జమ్మలమడుగు డీఎస్పీ వెంకటేశ్వరరావు శనివారం కొండాపురం పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన సర్కిల్ ఆఫీసు, స్టేషన్ లోని రికార్డులను తనిఖీ చేశారు. క్రైమ్ వివరాలను అడిగి తెలుసుకున్నారు. శాంతిభద్రతల నిర్వహణకు సిబ్బందికి పలు జాగ్రత్తలు, సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో కొండాపురం సీఐ రాజా, ఎస్సై ప్రతాప్‌రెడ్డి , సిబ్బంది పాల్గొన్నారు.

వేర్‌హౌస్ గోడౌన్ తనిఖీ


వేర్‌హౌస్ గోడౌన్లను తనిఖీచేస్తున్న మురికినాటి శ్రీధర్

ప్రొద్దుటూరు టౌన్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): రూరల్ పరిధిలో ఉన్న సర్విరెడ్డిపల్లెలోని వేర్‌హౌస్ గోడౌన్‌ను ఏపీరాష్ట్ర వేర్‌హౌస్ డైరెక్టర్ మురికినాటి శ్రీధర్ శనివారం ఆకస్మిక తనిఖీ చేశారు. గోడౌన్‌లో ఉన్న స్టాక్‌పాయింట్‌ను పరిశీలించారు. గోడౌన్‌లోని రికార్డులను తనిఖీ చేసి సిబ్బందికి సూచనలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పేద ప్రజలకు ఇచ్చే అన్ని రకాల సరుకులను భద్రంగా కాపాడి సకాలంలో ఆయా రేషన్‌షాపులకు చేరవేయాలని సూచించారు. గోడౌన్లలో రికార్డుల్లో అవకతవకలు లేకుండా సక్రమంగా నిర్వహించాలని ఆదేశించారు.

వ్యవసాయం..యాంత్రీకరణం


డ్రోన్‌తో వరిపైరుకు మందు పిచికారీ చేస్తున్న దృశ్యం(ఫైల్)


ట్రాక్టరుతో టిల్లరు కొడుతున్న దృశ్యం (ఫైల్)

రాజుపాలెం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : ఆధునిక యుగంలో వ్యవసాయం యాంత్రీకరణగా మారింది. తద్వారా వ్యవసాయంలో వేగవంతం పెరుగుతోం ది. దీనికి తోడు రైతన్నలకు రాష్ట్ర ప్రభుత్వం సబ్సిడీకి సాంకేతికత యాంత్రీ కరణ యంత్రాలు అందంచడం ద్వారా వ్యవసాయం మరింత సులభతరమైంది. వివరాల్లోకి వెళితే.. రాజుపాలెం మండ లంలో సాగుభూమి 42వేల ఎకరాలకు పైబడి ఉంది. అం దులో ఖరీఫ్ 15వేల ఎకరాలు, రబీలో 17వేల ఎకరాలు పంట సాగు చేసుకునేందుకు రైతన్నలకు భూమి అనుకూలంగా ఉంది. గతంలో వ్యవసాయం చేయడం ద్వారా ఎద్దులు, దున్నలను విని యోగించి రోజుకు ఒక ఎకరా సేద్యం చేయడం, విత్తనాలు విత్తి నా కేవలం ఎరువులతో పంటలు పండించడం, జీవనశైలి ముందుకు పోకపోవడంతో పాటు వ్యవసాయం సాగేది కాదు. కాలానుగుణంగా ట్రాక్టర్లు రావడంతో వ్యవసాయం పుంజుకుంది. రోజుకు ఒక ట్రాక్టరు 20 ఎకరాలు సేద్యం చేయడం, ఒకరోజు దమ్ము చేసి ఐదు ఎకరాలు నాటు వేయడం రకరకాలుగా వ్యవసాయం పుంజుకోవడంతో రైతన్నలు మంచి అభివృద్ధి బాటలోకి వచ్చారు. పురుగు మందు పిచికారి చేసేందుకు ఒక రైతుకు ఎకరానికి పది ట్యాంకుల మందు వేసేందుకు కూలీకి రూ.500, నీళ్లు పోసేవానికి రూ.500 చెల్లించే పద్ధతికి స్వస్తి చెప్పి ఎకరాకు కేవలం రూ.300 నుంచి రూ400 లతోనే డ్రోన్లు, ట్రాక్టరు పంపుల ద్వారా మందు పిచికారి చేయడం ద్వారా ఒకరోజుకు 5 నుంచి 15 ఎక రాల వరకు ఈ మందు పిచికా రి జరుగుతుం డడంతో రైతులకు ఖర్చు తగ్గడంతో పాటు మరింత సులభతర మైంది. పంటలకు కూడా పశువుల ఎరువులు పోయి కాంప్లెక్స్ ఎరువులు, నానో ఎరువులు తదితర సాంకేతిక ఎరువులు రావడంతో మంచి దిగుబడులు సాగిస్తున్నారు. ఏది ఏమైనా వ్యవసాయం ముందుకు సాగేందుకు సాంకేతిక అనుకూలంగా మారింది. మరింత ప్రోత్సాహాలు అందిస్తే రైతన్నలకు సులభతరమైన వ్యవసాయం చేయవచ్చని పలువురు రైతులు తెలిపారు.

రాష్ట్రస్థాయి నైపుణ్య పోటీలకు విద్యార్థుల ఎంపిక


జిల్లా స్థాయిలో ప్రతిభచూపిన విద్యార్థులతో ఎంఈఓలు పాఠశాల ఉపాధ్యాయులు

మైదుకూరు నవంబరు8(ఆంధ్రజ్యోతి): జిల్లా స్థాయిలో సమగ్ర సర్వశిక్ష అభియాన్ ఆధ్వర్యంలో స్కిల్ డెవలప్ పోటీలలో మైదుకూరు జిల్లా పరిషత్ బాలుర పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఇలియాస్ అహమ్మద్ తెలిపారు. జిల్లా స్థాయిలో ప్రతిభచూపిన తాజ్‌హుస్సేన్, నరసింహ, వెంకట చందులను ఎంఈఓలు పద్మలత, నరహరిశర్మ పాఠశాల ఉపాధ్యాయులు అభినందిస్తూ రాష్ట్రస్థాయి పోటీలలో రాణించాలని ఆకాంక్షించారు. విద్యార్థుల ప్రతిభకు సమష్టిగా కృషి చేసిన వృత్తివిద్య బోధకులు గురుమోహన్, తేజ,మధురిమలను అభినందించారు. కాగా ఈనెల 14న విజయవాడలో జరిగే పోటీలలో వారు పాల్గొంటారన్నారు.

క్షౌరశాలలకు 200 యూనిట్లు ఉచిత విద్యుత్

బద్వేలు, నవంబర్ 8 (ఆంధ్రజ్యోతి): నాయిబ్రాహ్మణులు నడిపే క్షౌరశాలలకు కూటమి ప్రభుత్వం200 యూనిట్లు ఉచిత విద్యుత్ అందజేస్తోందని నాయీబ్రాహ్మణ వెల్ఫేర్‌అండ్ కార్పొరేషన్ డైరెక్టర్ కొళవళి వేణుగోపాల్ పేర్కొన్నారు. శనివారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ బద్వేలు నియోజకవర్గంలో మొత్తం 190 క్షౌరశాలలు ఉండగా ఇందులో పోరుమామిళ్లలో 55, కలసపాడులో 15, కాశినాయనలో 5, బి.కోడూరులో 5, అట్లూరులో 9, గోపవరంలో 5, బద్వేలు మండలంలో 6 షాపులు ఉన్నాయన్నారు. బార్బర్‌షాపులకు ఉచిత విద్యుత్ వెసులుబాటు కల్పించడంపై పలువురు నాయీబ్రాహ్మణులు హర్షం వ్యక్తం చేస్తున్నారన్నారు, జిల్లాలో సుమారు 2300 బార్బర్ షాపులు ఉన్నాయని వాటిలో ప్రభుత్వ నిబంధనలమేరకు అందరకి ఉచిత విద్యుత్ అందనుండడంతో వారు ఆనందం వ్యక్తం చేస్తున్నారన్నారు. ప్రభుత్వం ఇచ్చే ఉచిత విద్యుత్‌కు ఎవరైనా అర్హులుంటే దరఖాస్తు చేసుకోవాలని విద్యుత్ శాఖ అధికారులు తెలిపారన్నారు. అర్హులు సంబంధిత పత్రాలతో ఆయా విద్యుత్ కార్యాలయాల వద్దకు వెళ్లి దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం

బి.కోడూరు, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : బాల్య వివాహాలు చేయడం చట్టరీత్యా నేరమని బద్వేలు ప్రాజెక్టు బాలల అభివృద్ధి అధికారి శ్రీదేవి అన్నారు. బేటిబచావో బేటి పడావో .. కార్యక్రమంలో భాగంగా శనివారం మండల సమైఖ్య సభాభవనంలో ఎంపీడీవో భాస్కర్ రావు అధ్యక్షతన బాలికే భవిష్యత్ అనే దానిపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా బద్వేలు ప్రాజెక్టు బాలల అభివృద్ధి అధికారి శ్రీదేవి హాజరై సభనుద్దేశించి మాట్లాడారు. ఎంపీడీవో భాస్కర్‌రావు మాట్లాడుతూ బాల బాలికల మీద వివక్ష చూపకుండా వారికి సమాన అవకాశాలు కల్పిస్తే వారు కూడా అబివృద్ధి సాధిస్తా రన్నారు. ఎంఈవో సునీల్‌కుమార్ బాల్యవివాహాలు చేయడం వల్ల వారి స్థితిగతులు ఎలా ఉంటాయో తెలిపారు. వైద్యాధికారి వినీత్‌కుమార్‌రాజు ఎ బేటి బచవో, బేటీ పడావో కార్యక్రమం పథకం ఉద్దేశ్యం అంశాలపై వివరించారు. కార్యక్రమంలో ఐటీడీఎస్ సూపర్ వైజరు సుగుణ, ఏపీవో రజాసాహెబ్, ప్రజాప్రతినిధులు, అన్నిశాఖల అధికారులు పాల్గొన్నారు.

డ్రగ్స్ రహిత సమాజంకోసం పాటు పడాలి

బద్వేలు, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): డ్రగ్స్ రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరూ పాటుపడాలని అర్బన్ సీఐ లింగప్ప పేర్కొన్నారు. శనివారం డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో శనివారం స్థానిక అర్బన్ పోలీసుస్టేషన్‌లో డ్రగ్స్ వద్దు.. ఆరోగ్యమే ముద్దు అనే పోస్టర్‌ను సీఐ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం సమాజంలో యువత మత్తుకు బానిస అవుతున్నారని, దీనిపై అవగాహన కల్పించేందుకు డీవైఎఫ్ఐ బృందం ముందుకు రావడం అభినందనీయమన్నారు.డ్రగ్స్ విక్రయించినా, స్వీకరించినా రెండూ నేరమేనని, కావున యువత డ్రగ్స్, గంజాయి వంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉంటూ తల్లిదండ్రులు పుట్టిన ఊరికి మంచి పేరుతీసుకు రావాలన్నారు. కార్యక్రమంలో పలువురు డీవైఎఫ్ఐ నాయకులు పాలొన్నారు.

వాహనదారులు రోడ్డు నిబంధనలు పాటించాలి


వాహన చోదకులకు అవగాహన కల్పిస్తున్న సీఐ దస్తగిరి

ముద్దనూరు నవంబర్8(ఆంధ్ర జ్యోతి):వాహన చోదకులు రహదారి భద్రత నియమాలు తప్పక పాటించాలని సీఐ దస్తగిరి సూచించారు.స్థానిక జమ్మలమడుగు బైపాస్ రోడ్డులోని శనివారం వాహనాల తనిఖీ చేపట్టారు. అందులో భాగంగా వాహన చోదకులకు రహదారి భద్రత పై అవగాహన కల్పించారు. ద్విచక్రవాహన చోదకులు హెల్మెట్ తప్పని సరిగా ధరించాలని, ఆటోలలో పరిమితికి మించి ప్రయాణికులను తరలించకూడదని, రోడ్డు ప్రమాదాల పై అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో పోలీసులు పాల్గొన్నారు.

అనుమతి లేని ఆసుపత్రులపై చర్యలు తీసుకోండి

బద్వేలు, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని అనుమతి లేని ప్రైవేటు ఆసుపత్రులపై జిల్లా వైద్యశాఖాధికారులు చర్యలు తీసుకోవాలని ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు పి. ప్రభాకర్ డిమాండ్ చేశారు. శనివారం స్థానిక సీపీఐ కార్యాలయంలో విలేకర్ల సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలో పదుల సంఖ్యలో అనుమతులు లేకుండా ప్రైవేటు ఆసుపత్రులు నిర్వహిస్తున్నా జిల్లా వైద్య శాఖాధికారులు పట్టించుకోవడం లేదని ఆయన ఆరోపించారు. ఈకార్యక్రమంలో పలువురు ఆపార్టీ నాయకులు పాల్గొన్నారు.

చెకుముకిలో జిల్లాస్థాయికి ముగ్గురు విద్యార్థులు

చాపాడు, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో శనివారం చాపాడులో జరిగిన మండలస్థాయి చెకుముకి పోటీల్లో అల్లాడుపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు జిల్లాస్థాయికి ఎంపికైనట్లు పాఠశాల సైన్స్ ఉపాధ్యాయులు శ్రీనివాసులు, మునిస్వామి తెలిపారు. ఎంపికైన వికాస్, జగన్, రిజ్వానా, విద్యార్థులు త్వరలో జిల్లాస్థాయి పోటీల్లో పాల్గొంటున్నట్లు వారు తెలిపారు.

మండల ఎస్టీయూ అధ్యక్షుడిగా శ్రీనివాసులు

ఖాజీపేట, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఖాజీపేట మండల ఎస్టీయూ ఏపీ అధ్యక్షుడిగా ఎం.శ్రీనివాసులును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. శనివారం జరిగిన సమావేశంలో ఎస్టీయూ నేతలు పాల్గొని నూతన అధ్యక్షుడిని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించడంలో ఎస్టీయూ ముందుంటుందని ఉపాధ్యాయుల సమస్యలు ఏవైనా ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు వెంకటరామిరెడ్డి, ఓబన్న, కరిముల్లా, ఫయాజ్, తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో శనేశ్వరస్వామి విగ్రహప్రతిష్ఠ

బద్వేలుటౌన్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని తెలుగుగంగకాలనీ సమీపంలో ఉన్న దత్తాత్రేయ ఆలయసన్నిధిలో శనివారం శనీశ్వరుని, కాలభైరవుని విగ్రహ ప్రతిష్ఠమహోత్సవం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వేదపండితులు ప్రదీప్‌కుమార్‌శర్మ, శ్రీనివాసశర్మలు ప్రత్యేక పూజలు నిర్వహించి విగ్రహాలను ప్రతిష్ఠించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నియోజకవర్గంలో శనేశ్వరదేవాలయం ఎక్కడా లేదని, ఇక్కడ ప్రతిష్ఠించడంతో భక్తులు శనేశ్వర పూజ చేసుకోవడానికి వీలుకలుగు తుందన్నారు. అనంతరం భక్తులు పాల్గొని ప్రత్యేకపూజలు నిర్వహించారు. కార్యక్రమంలో యానాదిరెడ్డి, లక్ష్మీనరసమ్మ, వెంకటేశ్వరరావు, నాగపార్వతి పాల్గొన్నారు.

ఆ బ్రిడ్జిపై ఆదమరిస్తే అంతే.. మరి


ప్రమాదకరంగా మారిన వెల్లాల బ్రిడ్జి

రాజుపాలెం, నవంబరు 8 (ఆంధ్ర జ్యోతి) : ప్రముఖ పుణ్యక్షేత్రమైన సంజీవరాస్వామి క్షేత్రానికి వెల్లాలపై నిర్మించిన బ్రిడ్జిపై వరదలకు పై పొర కొట్టుకునిపోయి గుంత ఏర్పడింది. దానికి తోడు ఇరుపక్కలా కడ్డీలు లేకుండా పోవడంతో కుందూ ఉధృతంగా ప్రవహిస్తుండడంతో ప్రమాదకరంగా మారింది. అయితే కర్నూలు జిల్లాతో పాటు ప్రొద్దుటూరు నుంచి వచ్చి వెళ్లే భక్తులు ఆ దారి న వెళ్లే వాహనదారులకు ఈ గుంత పూర్తిగా ఇబ్బందికరంగా మారింది. వాహనదారులు ఆదమరిస్తే గుంతలో పడడంతో పాటు గుంత తప్పితే కుందూలో పడే పరిస్థితి ఉంది. అదే విధంగా పక్కనే మలుపు వద్ద కేసీ కెనాల్‌కు కూడా ఇరువైపులా కడ్డీలు లేకపోడంతో మరో ప్రమాదం పొంచి ఉంది ఆర్‌అండ్‌బీ అధికారులు స్పందించి ఈ గుంత పూడ్చడంతో పాటు ఇరువైపులా కడ్డీలు వేయాలని ప్రజలు కోరుతున్నారు. ప్రమాదాలు నివారించేందుకు ప్రస్తుతానికి దారి బంద్ చేయడమో కానీ, లేకపోతే ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని పలువురు కోరుతున్నారు.

ట్రాఫిక్‌తో వాహనదారులకు ఇక్కట్లు

- రెవెన్యూ డివిజన్ కేంద్రమైనా తీరని సమస్యలు
- వాహనాలు అడ్డదిడ్డంగా వెళుతుండడంతో తప్పనిపాట్లు
- అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజల విజ్ఞప్తి


గాంధీ విగ్రహం చుట్టూ అడ్డదిడ్డంగా వెళుతున్న వాహనాలు

జమ్మలమడుగు, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ డివిజనల్ కేంద్రమైన జమ్మలమడుగులో ప్రజలకు ట్రాఫిక్ ఇక్కట్లు తప్పడంలేదు. గత కొంత కాలంగా ప్రధాన రోడ్లు ఇరుకుగా మారడంతో ట్రాఫిక్ అంతరాయం తరచూ జరుగుతోంది. పాత బస్టాండులో గాంధీ విగ్రహం చుట్టూ వ్యాపారస్థులు డ్రైనేజీ కాలువలు దాటి రోడ్డుపై ఏర్పాటు చేయడం వలన బస్సులు మలుపు తిప్పుకోవాలన్నా ఇబ్బందికరంగా మారింది. జమ్మలమడుగులో వ్యాపారస్థులకు, దుకాణాదారుల యజమానులకు ఎవరు చెప్పలేని స్థితిలో ఉన్నారు. పోలీసు అధికారులు, సిబ్బంది వ్యాపారస్థులకు చెప్పినా స్పందించడం లేదని బహిరంగ ఆరోపణలున్నాయి. గాంధీ విగ్రహం వద్ద రాత్రి 7.30 గంటల నుంచి 9.30 గంటల వరకు ప్రైవేటు బస్సుల బయటి ప్రాంతాలకు వెళ్లే వాహనాల రద్దీ ఉంటుంది. దానికితోడుగా సిమెంటు ట్యాంకర్లు, ఇసుక టిప్పర్లు, గ్రావెల్ టిప్పర్లు రోడ్డు ఇరుకుగా ఉండడం వలన ట్రాఫిక్ అంతరాయం కలుగుతోంది. దీంతో ద్విచక్ర వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డుపై నడిచి వెళ్లే బాటసారులకు ప్రమాదాల భయం తీసుకుంది. తరచూ పాత బస్టాండులో వాహనదారులకు, ద్విచక్ర వాహనదారులకు గొడవలు జరుగుతూనే ఉన్నాయి. ఇప్పటికైనా జమ్మలమడుగు మున్సిపాలిటీ కమిషనర్ వెంకటరామిరెడ్డి, జమ్మలమడుగు అర్బన్ సీఐ నరేష్‌బాబు, అధికారులు ప్రధాన రోడ్లపై ట్రాఫిక్ అంతరాయం కలుగకుండా కఠిన చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

మున్సిపాలిటీల్లో మెరుగైన వసతులు కల్పించాలి


సీపీఐ కార్యదర్శుల వర్క్‌షాపులో మాట్లాడుతున్న జిల్లా కార్యదర్శి గాలి చంద్ర

ప్రొద్దుటూరు టౌన్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీలు, నగర పాలక సంస్థలో ప్రజలకు మెరుగైన వసతులు కల్పించడానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని సీపీఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర పేర్కొన్నారు. శనివారం సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈనెల 29, 30 తేదీల్లో జిల్లాలోని మున్సిపల్, నగర పాలక సంస్థస్థాయి సీపీఐ కార్యదర్శుల వర్క్‌షాపు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. జిల్లాలో అయిదు కోట్ల బడ్జెట్ ఉన్న మున్సిపాలిటీతోపాటు వంద కోట్ల బడ్జెట్ ఉన్న మున్సిపల్ కార్పొరేషన్ ఉన్నా ఎక్కడా ప్రజలకు తగిన మౌలిక వసతులు కల్పించడంలేదని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన 15వ ఫైనాన్స్ కార్పొరేషన్ నిధులు కూడా ఖర్చు చేయకపోవడంతో మగ్గిపోతున్నా ఈ నిధులపై ప్రజాప్రతినిధులు ఎందుకు నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారని ప్రశ్నించారు. ప్రజలకు మంచినీరు, డ్రైనేజీ, రోడ్లు, లైట్లు అందించలేని దుస్థితిలో ఉన్నారని పేర్కొన్నారు. కౌన్సిల్ సమావేశాల్లో ప్రజా అవసరాలకోసం భారీగా ఖర్చు చేస్తున్నట్లు చూపుతున్నా ఆచరణలో ఎటువంటి నిధులు కేటాయించడంలేదని విమర్శించారు. ఈ సమావేశంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు రామయ్య, పట్టణ కార్యదర్శి సుబ్బరాయుడు, శివారెడ్డి, రామకృష్ణ, హరి, పీటర్, సుబ్బరామయ్య తదితరులు పాల్గొన్నారు.

మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణ ఆలోచనే వద్దు

ప్రొద్దుటూరు టౌన్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): ప్రైవేటు మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణను ప్రభుత్వం నిలిపివేయాలని పీఆర్‌ఎస్‌వైఎఫ్ రాష్ట్ర కన్వీనర్ కన్నెలూరు శంకర్ పేర్కొన్నారు. శనివారం ప్రభుత్వ ఎస్సీ హాస్టల్ వద్ద ప్రభుత్వ మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణను ఆపాలని, జీవో నెం.590ని రద్దు చేయాలన్న పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పది ప్రభుత్వ మెడికల్ కళాశాలలను రాష్ట్ర ప్రభుత్వం పీపీపీ పేరుతో ప్రైవేటుపరం చేయడం దారుణమన్నారు. ఈ జీవో వలన పేద విద్యార్థులకు వైద్య విద్య దూరం అవుతుందని, పేదల ఆరోగ్యం ప్రమాదంలో పడుతుందని పేర్కొన్నారు. పేద విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణను ఉపసంహరించుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా కన్వీనర్ నాగేంద్రబాబు, అజయ్, రంజిత్, హరి, శివ, ఓబులేసు, వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.

నందిపల్లె వద్ద చెక్‌పోస్ట్ ఇక మైదుకూరుకే..

మైదుకూరు రూరల్, నవంబరు 8(ఆంధ్రజ్యోతి) : నందిపల్లె వద్ద ఉన్న బద్వేల్ మార్కెట్ కమిటీ చెక్‌పోస్ట్ ఇక మైదుకూరు మార్కెట్ కమిటీకి అనుసంధానం చేసినట్లు మైదుకూరు మార్కెట్ కమిటీ చైర్మన్ ఏపీ రవీంద్ర పేర్కొన్నారు. శనివారం విలేకరుల సమావేశంలో రవీంద్ర మాట్లాడుతూ గతంలో బ్రహ్మంగారిమఠం మండలం, బద్వేల్ మార్కెట్ కమిటీలో ఉండేదని మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్ ఉన్నతాధికారులతో మాట్లాడి బ్రహ్మంగారిమఠం మండలం మైదుకూరు మార్కెట్ కమిటీకి అనుసంధానం చేయడం జరిగిందన్నారు. అందువలన నందిపల్లె వద్ద నున్న మార్కెట్ కమిటీ చెక్‌పోస్ట్‌ను మైదుకూరు మార్కెట్ కమిటీ వారు పెట్టుకోవడానికి అవకాశం వచ్చిందన్నారు. త్వరలో మైదుకూరు మార్కెట్ కమిటీ తరపున అక్కడ నూతనంగా ఒక చెక్‌పోస్ట్ ఏర్పాటు చేసి త్వరలో ప్రారంభించనున్నట్లు రవీంద్ర తెలిపారు.

శబరిమలకి ఆర్టీసీ అద్దె బస్సులు

బద్వేలు రూరల్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : శబరిమల వెళ్లే అయ్యప్పస్వాములకు ఆర్టీసీ అతి తక్కువ ధరకే అద్దె బస్సులను పంపుతామని ఆర్టీసీ డీఎం నిరంజన్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆర్టీసీ బస్సులకు కర్ణాటక, తమిళనాడు, కేరళ రాష్ట్రాల్లో ఎటువంటి ఆర్టీవో పన్నులు చెల్లించాల్సిన పని లేదని, కేరళలో ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక పార్కింగ్ ఆర్టీసీకి సౌకర్యం ఉంటుందన్నారు. బస్సులో వంట మనుషులు, అటెండరుతో కలిపి ఏడు మందికి ఉచిత ప్రయాణం సౌకర్యం ఉందన్నారు. ఆర్డినరీ , ఎక్స్‌ప్రెస్, అల్ట్రాడీలక్స్, సూపర్ లగ్జరీ బస్సులు అందుబాటులో ఉన్నాయని శబరిమల వెళ్లే అయ్యప్పస్వామి భక్తులు ఆర్టీసీ సేవలను సద్వినియోగం చేసుకోవాలని డీఎం కోరారు.

రాష్ట్ర స్థాయి మాక్ అసెంబ్లీకి ఎర్రగుంట్ల విద్యార్థిని


విద్యార్థిని అభినందిస్తున్న ఉపాధ్యాయులు

ఎర్రగుంట్ల నవంబర్8(ఆంధ్రజ్యోతి):రాష్ట్ర స్థాయి మాక్ అసెంబ్లీకి ఎర్రగుంట్ల బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థిని ఎం.సంగీత ఎంపికైనట్లు మండల విద్యాశాఖాధికారి శివప్రసాద్ తెలిపారు. రాజ్యాంగ దినోత్సవం పురస్కరించుకొని రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న స్టూడెంట్ అసెంబ్లీలో జిల్లా స్థాయి పోటీలు ప్రొద్దుటూరు జార్జి కోఆపరేటివ్ క్లబ్ నందు నిర్వహించగా సంగీత ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ఆయన తెలిపారు.ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు రామాంజనేయరెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొని విద్యార్థిని ఈ సందర్భంగా అభినందించారు.

గూడెంచెరువులో సంతకాల సేకరణ

జమ్మలమడుగు, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు మండలంలోని గూడెం చెరువు గ్రామంలో శనివారం ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం మెడికల్ కళాశాల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కోటి సంతకాల సేకరణ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా గూడెం చెరువు గ్రామ ప్రజలు గ్రామంలో ఉన్న పలు సమస్యలను రామసుబ్బారెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు మల్కిరెడ్డి హనుమంతరెడ్డి, వల్లంబావిగారి హృషికేశవరెడ్డి, నాగేశ్వరరెడ్డి, తదితర నాయకులు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి పాఠకులకు గమనిక
ఆంధ్రజ్యోతి కొత్త చందాదారులుగా చేరదలచుకున్న వారు, పేపరు పంపిణీ విషయంలో ఎలాంటి సమస్యలు ఎదురైనా ఈ క్రింది ఫోన్ నెంబర్లను సంప్రదించగలరు.
ప్రొద్దుటూరు - A.C.O.: 99854 11466 జమ్మలమడుగు - S.R.: 94404 72816 మైదుకూరు - S.R.: 91334 42886 బద్వేల్ - S.R.: 99666 83437 D.C.M. : 99854 11184